

ఐవీఆర్ఎస్ సర్వేలో 'అన్నవరం' ఆరో స్థానం 7

భార్యను చంపి పరారైన భర్త 7

» కాకినాడ రూరల్ ఇంద్రపాలెంలో సంఘటన

రేపు సీఎం చంద్రబాబు నల్లజర్ల రాక

» 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలో రైతులతో ముఖాముఖి

» ఏర్పాట్లు పరిశీలించిన 'తూర్పు' కలెక్టర్, ఎస్పీ



రాజమహేంద్రవరం/నల్లజర్ల, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఈనెల 3వ తేదీ బుధవారం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రైతన్నా-మీకోసం కార్యక్రమంలో భాగంగా నల్లజర్ల రానున్నారు. ఈ నేపథ్యంలో సమయం తక్కువగా ఉండడంతో అధికార యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగింది. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్‌తో కలసి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహకిశోర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ బుధవారం సీఎం పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చకచకాచేయాలని, పర్యటన విజయవంతం చేయాలన్నారు. ప్రొటోకాల్, భద్రత, సభా ప్రాంగణం, ప్రజావేదిక, హెలిప్యాడ్, రవాణా అండ్ పార్కింగ్, స్టాల్స్, రైతులతో సీఎం ముఖాముఖి వంటి ఏర్పాట్లపై విభాగాలవారీగా సూచనలు చేశారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత తొలిసారి నియోజకవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్నారని, రైతుల కోసం వస్తున్నారని, అందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సీఎం కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. జేసీ మేఘాస్వరూప్, ఏఎస్పీ మురళీకృష్ణ, ఆర్డీవో రాణి సుస్మిత, జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు పాల్గొన్నారు. నల్లజర్ల బైపాస్ సమీపంలో ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు సభస్థలాన్ని ఏర్పాటుచేశారు. ఆయిల్‌పాం గెలల కోత, గిట్టుబాటు ధరలపై రైతులతో సీఎం మాట్లాడతారు. వరి రైతులు, కూరగాయల రైతులతోనూ మాట్లాడేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 10గంటలకు చంద్రబాబు చేరుకుంటారని సమాచారం. ఈ కార్యక్రమం తర్వాత కేడర్‌తోనూ భేటీ ఉంటుంది.

రబీకి రెడీనా..



వ్యవసాయ సీజన్.. మారుతోంది. ఖరీఫ్, రబీ సీజన్లలో ఎప్పుడు నారుమళ్లు వేయాలి, ఎప్పుడు ఊడ్పులు చేయాలి, పంట చేతికొచ్చేది, మాసూళ్లు ఎప్పుడు పూర్తవుతాయో ఒక లెక్క ఉండేది. వాతావరణ మార్పులు, తుఫాన్ల దెబ్బకు ఈ సీజన్‌లు అస్తవ్యస్తం అయ్యాయి. ఈ నెలాఖరుకి రబీకి నాట్లు పడాలి. కానీ వరి కోతలు ఇంకా సాగుతున్నాయి. పది రోజుల దాకా కొనసాగే పరిస్థితి ఉంది. మరి రబీ నాట్లు ఎప్పుడు పూర్తవుతాయి. కచ్చితంగా ఆలస్యమవుతాయని చెప్పొచ్చు.

» పూర్తికాని ఖరీఫ్ మాసూళ్లు

» 31లోపు రబీ నాట్లు పూర్తంటే ఎలా

» తూర్పు డెల్టాకు నీరు విడుదల

» సెంట్రల్, పశ్చిమ డెల్టాలకు ఎప్పుడో

» ఖరీఫ్ రైతును వెంటాడుతున్న వానలు

» ఈనెల 15వ తేదీలోపు ఖరీఫ్ ఒబ్బిడి

» ఇప్పటికే 2 లక్షల 10 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

» ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో 8.96,507 ఎకరాల్లో రబీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోని మూడు డెల్టాల పరిధిలోని వరిసాగు ఒక పద్ధతిలో సాగడంలేదు. పంట ప్రకృతి వైపరీత్యాల బారిన పడకూడదంటే ముందుగానే పంట సాగు మొదలుపెట్టాలనే ఆలోచన ఎప్పటి నుంచో ఉంది. గతంలో మే నెలలోనే నారుమళ్లకు సిద్ధం చేసుకుని, జూన్ నెలలో నాట్లు మొదలు పెట్టేవారు. కొన్నేళ్ల నుంచి ఈ క్రమం తప్పింది. బాగా ఆలస్యం అవుతోంది. డిసెంబరు నెల వచ్చేసినా వరి కోతలు ఇంకా పూర్తికాలేదు. తూర్పుగోదావరి జిల్లాలో మూడు వంతులకుపైగా జరిగినా, మిగతా జిల్లాల్లో వరి మాసూళ్లు పూర్తికాలేదు. ఈ పరిస్థితుల్లో రైతుల ధాన్యం ఇంకా కొంత వరకూ కళ్లాలలోనూ, రోడ్లమీద ఆరబోతలోనూ, రాశులుగానూ ఉంది. దిత్వా తుఫాన్ వల్ల ప్రస్తుతం కోతలు ఆపేసినా, ఆరబోసిన ధాన్యాన్ని రక్షించుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కానీ ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండడంతో చాలావరకూ ధాన్యం కొనుగోలు జరుగుతోంది. సోమవారం నాటికి జిల్లాలో 29,164 మంది రైతుల నుంచి 2,21,036 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 20,225 మంది రైతులకు రూ.340.70 కోట్లు జమచేశారు. ఇది మంచి పరిణామమే. కానీ రబీ సాగు విషయంలో ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ధవళేశ్వరం సర్కిల్ పరిధిలోని తూర్పు, పశ్చిమ, సెంట్రల్ డెల్టాల్లో సోమవారం నుంచే రబీ ప్రారంభమైనట్టు చెబుతూ, ఈనెలాఖరు నాటికి నాట్లు కచ్చితంగా పూర్తి కావాలని చెబుతున్నారు. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు అనుకూలంగా లేవు. సంక్రాంతి తర్వాత వరకూ కూడా రబీ సాగు కొనసాగే పరిస్థితి ఉంది. ఇక ఫిబ్రవరి 1 నుంచి సాగునీటిని వంతుల వారీగా అమలుచేయడానికి నిర్ణయించారు. వచ్చే ఏడాది మార్చి 31కి రబీ సాగు పూర్తి చేయాలనేది నిర్ణయం.



బ్యారేజీ నుంచి తూర్పు డెల్టాకు సాగునీటిని విడుదల చేస్తున్న ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, ఎమ్మెల్యేలు గోరంట్ల, నల్లమిల్లి, బండారు

• 93.26 టీఎంసీల నీరు అవసరం

ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో ధవళేశ్వరం బ్యారేజీ నుంచి వచ్చే నీటితో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని తూర్పు, సెంట్రల్, పశ్చిమ, డెల్టాలకు సంబంధించి ఈ రబీలో 8,96,507 ఎకరాల్లో వరిపంట సాగుచేయనున్నారు. అందులో తూర్పుడెల్టా, పీబీసీ పరిధిలో 2,64,507 ఎకరాలు, గోదావరి సెంట్రల్ డెల్టా పరిధిలో 1,72,000 ఎకరాలు, పశ్చిమ డెల్టా పరిధిలో 4,60,000 ఎకరాల ఆయకట్టు సాగులో ఉంటుంది. దీనికోసం 93.26 టీఎంసీల సాగునీరు అవసరం. అయితే అంతనీరూ అందుబాటులో ఉందని అధికారులు చెబుతున్నారు. మార్చి 31వ తేదీకి పూర్తవ్వాలని అధికారులు చెబుతున్నా, ఇతర ప్రాంతాల వారు మాత్రం ఏప్రిల్ 15వ తేదీ వరకూ నీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

● తూర్పు డెల్టాకు నీరు విడుదల

రబీసాగు కోసం తూర్పు డెల్టాకు సోమవారం ధవళేశ్వరం బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేశారు. కానీ ఇంకా సెంట్రల్, పశ్చిమ డెల్టాలకు నీటిని విడుదల చేయలేదు. సోమవారం ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. బండారు సత్యానందరావు సమక్షంలో తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ కె.గోపినాథ్, ఈఈ శ్రీనివాస్, డిఈరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో వర్క్‌షాపులు పకడ్బందీగా నిర్వహించాలి

» వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశం

అమలాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈనెల 3న రైతుసేవా కేంద్రం పరిధిలో పకడ్బందీగా వర్క్‌షాప్‌లు నిర్వహించి రైతు సమస్యలు తెలుసుకోవాలని కలెక్టర్ మహేష్‌కుమార్ వ్యవసాయ, మత్స్యశాఖ, ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ అనుబంధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. గతనెల 24నుంచి ఆరురోజులపాటు నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమాల ద్వారా జిల్లావ్యాప్తంగా 22 మండలాల్లో 1.45లక్షల రైతు కుటుంబాలను గుర్తించి ఫొటోలతో సహా డేటా బేస్ సర్వర్‌లో క్యాప్చర్ చేశామన్నారు. సమావేశంలో జేసీ టి.నిషాంతి, వ్యవసాయాధికారి బోసుబాబు, ఉద్యాన అధికారి బీవీ రమణ, మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ సంచాలకుడు వెంకటరమణారావు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు-స్వచ్ఛమైన పారిశుధ్యంతో జిల్లాను ఆదర్శంగా నిలపాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. పారిశుధ్య మిషన్ సమన్వయ సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. కన్జర్వెన్సీ విభాగంలో ఉన్న ప్రతి అధికారి ఆర్‌డబ్ల్యుఎస్ శాఖాపరంగాఉన్న ఖాళీలను సమర్పించాలని ఆదేవించారు. జేసీ నిషాంతి, డీఎంహెచ్‌వో దుర్గారావుదొర పాల్గొన్నారు.

పాల్ ల్యాబ్‌తో సామర్థ్యాల ఆధారంగా విద్యాభ్యాసం

» జిల్లా పాల్ ల్యాబ్స్ నోడల్ అధికారి

రామచంద్రపురం(ద్రాక్షారామ),డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):పాల్‌ల్యాబ్‌తో విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా విద్యనభ్యసించవచ్చని జిల్లా పాల్ ల్యాబ్స్ నోడల్ అధికారి పిల్లి రాంబాబు అన్నారు. రామచంద్రపురంలోని ఎస్‌బిజీ పాఠశాలలో పాల్ లాబ్‌ను కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ సలాది వెంకటప్ప నాయుడుతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 31పాఠశాలల్లో పాల్ ల్యాబ్స్ ఉండగా నూతనంగా 9 పీఎంశ్రీ పాఠశాలల్లో పాల్ ల్యాబ్స్ ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో పాల్ ల్యాబ్‌కు 30ట్యాబ్స్ అందచేశామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణమూర్తి,ఎస్ఎంసీ చైర్మన్ గుబ్బల విజయలక్ష్మి, ఫస్ట్‌అసిస్టెంట్ మహాలక్ష్మి పాల్గొన్నారు.

అమలాపురంలో ప్రైవేటు విద్యాసంస్థల బస్సుల తనిఖీ

అమలాపురంటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత, ప్రమాదాల నివారణ ముందస్తు చర్యల్లో భాగంగా సోమవారం అమలాపురంలోని ప్రైవేటు విద్యాసంస్థల బస్సులను తనిఖీ చేసినట్టు జిల్లా రవాణాశాఖాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన 19 బస్సుల్లో సాంకేతికపరమైన లోపాలను గుర్తించి వారంరోజుల్లోగా సరిచేయించుకోవాలని, అక్కడికక్కడే ఆయా స్కూలు యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. ప్రత్యేక తనిఖీల్లో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, జ్యోతిసురేష్, కౌశిక్ పాల్గొన్నారు.



అమలాపురంలో ప్రైవేటు బస్సులను తనిఖీ చేస్తున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు

నీటిసంఘాల ప్రతినిధులకు.. గౌరవం లేకపోతే ఎలా?

» రబీకి పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలి

» గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ శ్రీనివాస్



నీటి సంఘాల అధ్యక్షుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

పి.గన్నవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నీటి సంఘాల ప్రతినిధులకు గౌరవం ఉందా.. లేదా.. అసలు సంఘాలు ఉన్నాయా అంటూ గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ ప్రశ్నించారు. పి.గన్నవరం ఇరిగేషన్ సబ్‌డివిజన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన నీటిసంఘాల ప్రతినిధుల సమావేశంలో వైస్‌చైర్మన్ కరుటూరి నరసింహరాజుతో కలిసి ఆయన మాట్లాడారు. గతంలో నీటిఎద్దడిని దృష్టిలో ఉంచుకుని డ్రైన్లపై క్రాస్‌బండ్‌లు, ఆయిల్ ఇంజన్ల ఏర్పాటులో ఇరిగేషన్ డీఈ ఆధ్వర్యంలో డ్రైన్స్ అధికారులు, నీటిసంఘాల ప్రతినిధులు సమన్వయంగా నిర్ణయం తీసుకునేవారని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని అన్నారు. వ్యవసాయశాఖ అధికారి, రెవెన్యూ అధికారి పరిశీలన తరువాతే క్రాస్‌బండ్‌లు, ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకుంటున్నారని, ఇటీవల జరిగిన సమావేశంలో కలెక్టర్, జేసీ ఈ తరహా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. విలువలేని పదవులు తమకు ఎందుకని, కలెక్టర్ కార్యాలయంలో సమావేశం జరిగితే తమకు కూర్చీలే లేవని ఆవేదన వ్యక్తం చేశారు. నీటిసంఘాల సమస్యలపై సీఎంను కలుస్తామన్నారు. రబీ పంటకు పూర్తిస్థాయిలో సాగు నీరును అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. నీటి సంఘాల పరిధిలో ఎక్కడెక్కడా క్రాస్ బండ్‌లు, ఆయిల్ ఇంజన్లు అవసరమో తెలపాలని కోరారు. గతంలో రబీ పంటకు శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందలేదని అధికారులు ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకుని సాగునీరు అందించాలని అన్నారు. డీఈ ప్రసాద్‌రాజు మాట్లాడుతూ నీటిసంఘాల ప్రతినిధులు అందించిన క్రాస్ బండ్‌లు, అయిల్ ఇంజన్ల వివరాలను పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. నీటి సంఘాల వారీగా క్రాస్‌బండ్‌లు, ఆయిల్ ఇంజన్ల వివరాలను అధికారులు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు పినిశెట్టి బుజ్జి, జగన్నాథం, వైస్ చైర్మన్లు చొల్లంగి సత్యనారాయణమూర్తి, ఆకాని బాబ్జీనాయుడు, ఏఈఈలు రమేష్, ఆనందకుమార్, రేష్మ, విజయలక్ష్మి, ఎ.నాయుడు పాల్గొన్నారు.

'తోట'ను మండపేట నుంచి తరిమివేయాలి

» మండపేట ఎమ్మెల్యే జోగేశ్వరరావు

» 'తూర్పు'లో విలీనంపై ఎమ్మెల్సీ తోట వర్సెస్ ఎమ్మెల్యే వేగుళ్ల

» త్రిమూర్తులుపై జనసేన నేత లీలాకృష్ణ ఆగ్రహం

» మండపేటలో నేతల మధ్య మాటల తూటాలు

మండపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో మండపేట నియోజకవర్గం విలీనంపై అధికార పార్టీ కూటమి నేతలకు, వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. మండపేటను పరిపాలనాపరమైన వ్యవహారాల కోసం మాత్రమే 'తూర్పు'లో కలిపారని, పూర్తిగా విలీనం జరగలేదని మండపేట నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆరోపించారు. పాలనాపరంగా కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం దూరంగా ఉండడంవల్ల, ప్రజల ఆకాంక్ష మేరకు మండపేటను రాజమహేంద్రవరంలో కలిపామని ఎమ్మెల్యే వేగుళ్ల స్పష్టం చేశారు. ఇదే అంశాలపై వేర్వేరుగా నేతలు ప్రెస్‌మీట్‌ల ద్వారా పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారు.

ఎమ్మెల్సీ తోట అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు: ఎమ్మెల్యే వేగుళ్ల

వైసీపీ నేత తోట త్రిమూర్తులు అవగాహన లేకుండా విలీనంపై మాట్లాడుతున్నారని, ఆయనకు మండపేటను రాజమహేంద్రవరంలో కలపడం ఇష్టం లేదని, ఆయన్ను ఇక్కడినుంచి తరిమివేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల అన్నారు. ఇక్కడ ప్రజలకు జిల్లా కేంద్రంతోనే పని తప్ప పార్లమెంట్ నియోజకవర్గంతో పని ఏముందని ప్రశ్నించారు. అసలు తోటకు విలీనం ఇష్టం ఉందో.. లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ ఇన్‌చార్జి అయిన తోట ఇక్కడ ప్రజల మనోభావాలను గౌరవించలేదన్నారు. వైసీపీ హయాంలో చెంతనే ఉన్న రామచంద్రపురం నియోజకవర్గంలో ఉన్న కాజులూరుతోపాటు పెదపూడి, తాళ్లరేవులను కాకినాడ జిల్లాలో విలీనం చేసిన విషయాలను ఆయన గుర్తుచేశారు.

తోటకు మున్సిపల్ సమావేశంలో కూర్చునే అర్హత లేదు: లీలాకృష్ణ

జనసేనపార్టీకి చెందిన ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ కూడా ఎమ్మెల్సీ తోటపై ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీకి మున్సిపల్ సమావేశంలో కూర్చునే అర్హత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ సమావేశానికి ఆయన వస్తే తాను కూడా వస్తానన్నారు. కమిషనర్ అసలు తోటను ఎందుకు సమావేశానికి రానిచ్చారని ప్రశ్నిస్తూ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

వ్యక్తిగతంగా దూషిస్తే సమాధానం ఘాటుగా ఉంటుంది: ఎమ్మెల్సీ తోట

తాను పాలనాపరంగా మాత్రమే మండపేట రాజమహేంద్రవరంలో ఉంటుందని, పార్లమెంట్ విషయానికి వస్తే అమలాపురంలో ఉంటుందని ప్రజలకు తాను వివరణ ఇస్తే.. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన నేత లీలాకృష్ణ తనపై వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆరోపించారు. రాజకీయ ఆరోపణలు చేస్తే తాను సమాధానం చెప్తానని, అదే వ్యక్తిగత దూషణలు చేస్తే తాను చెప్పే సమాధానం చాలా ఘాటుగా ఉంటుందని తెలిపారు. చర్చకు వస్తే తాను సిద్ధమన్నారు. తనని పిచ్చి కుక్క అని ఎమ్మెల్యే ఆరోపించడంపై స్పందిస్తూ పిచ్చికుక్క కరిస్తే ఎలా ఉంటుందో తెలీదా? ముందు నీ పిచ్చి చూసుకోవాలంటూ ప్రతి సవాల్ విసిరారు. జనసేన నేత లీలాకృష్ణను విమర్శించే స్థాయి తనది కాదన్నారు. మండపేటలో రెండురోజులుగా వరుసగా కూటమి నేతలు వర్సెస్ ఎమ్మెల్సీ తోట మధ్య మాటల యుద్ధం జరుగుతుంది. పరస్పర ఆరోపణలు, దూషణలతో మండపేటలో రాజకీయం వేడెక్కుతోంది.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

కలెక్టరేట్ 'పీజీఆర్ఎస్'కు 135 అర్జీలు

అమలాపురంటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తప్పవని కలెక్టర్ మహేష్‌కుమార్ హెచ్చరించారు. పీజీఆర్ఎస్‌కు గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేస్తామన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కలెక్టర్, జేసీ నిషాంతి, డీఆర్వో కె.మాధవి, జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్, డీఎల్డీవో రాజేశ్వరరావు, ప్రజలనుంచి 135 అర్జీలు స్వీకరించారు.

ఎస్పీ కార్యాలయంలో 25 అర్జీలు

జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్‌తో కలిసి జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా పీజీఆర్ఎస్ నిర్వహించారు. బాధితుల సమస్యలను ముఖాముఖి అడిగి అర్జీలను స్వీకరించారు. భూ తగాదాలు, కుటుంబ కలహాలు, సివిల్ తగాదాలకు సంబంధించి 25 అర్జీలను స్వీకరించారు. క్షేత్రస్థాయిలో నిష్పక్షపాతంగా విచారణ జరిపి అర్జీలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు.



అర్జీదారుల సమస్య వింటున్న ఎస్పీ రాహుల్ మీనా

కాయగూరలు, నిత్యావసర వస్తువుల ధరలపై నియంత్రణ ఉండాలి: జేసీ



సమావేశంలో జేసీ, పౌరసరఫరాలశాఖ అధికారి ఉదయభాస్కర్

అమలాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ధరల నియంత్రణలో పౌరసరఫరాలు, మార్కెటింగ్‌శాఖల ధరల పర్యవేక్షణ, తూనికల కొలతలశాఖ కచ్చితత్వ పర్యవేక్షణ సంస్థలను మరింత బలోపేతం చేయాలని జేసీ నిషాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ధరల నియంత్రణ కమిటీ సమావేశం ఆమె అధ్యక్షతన సోమవారం జరిగింది. నిత్యావసరాలు, కూరగాయల ఉత్పత్తి, సరఫరా, డిమాండ్ ధరలు, కూరగాయలు వంటి పంటల ఉత్పత్తిపై ఉద్యానశాఖ అధికారులతో సమీక్షించారు. ధరల నియంత్రణపై శాఖల సమన్వయంతో వినియోగదారులకు సరసమైన ధరలకు తాజాఉత్పత్తులు సరఫరా చేయాలని ఆమె ఆదేశించారు. కూరగాయలు, నిత్యావసరా ల కొలతలను పరిశీలించి అవకతవకలపై కేసులు నమోదు చేయాలన్నారు. పౌరసరఫరాలు, తూనికలు, కొలతలు, మార్కెటింగ్ శాఖల పనితీరుపై చర్చించారు. నిత్యావసరవస్తువుల ధరలు అందుబాటులో ఉండేలా మార్కెటింగ్, ఎస్టేట్ అధికారులు చర్యలు చేపట్టి రైతులకు గిట్టుబాటు ధరలు, వినియోగదారులకు సరసమైన ధరలకు లభ్యమయ్యేలా చర్యలుతీసుకోవాలన్నారు. ఔషధాలపై ధరల నియంత్రణ పర్యవేక్షక వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. జిల్లా పౌరసరఫరాలఅధికారి ఉదయభాస్కర్, మేనేజర్ శ్రీనివాసరావు, డీసీహెచ్ఎస్ కార్తీక్, మార్కెటింగ్ శాఖ ఏడీ విశాలాక్షి, జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధికి చికిత్స కన్నా.. నివారణే మిన్న

» కలెక్టర్ మహేష్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి చికిత్స కన్నా నివారణే మిన్న అని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. జిల్లా ఆరోగ్యవైద్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంనుంచి గడియారస్తంభం సెంటర్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని, అప్రమత్తంగా ఉండడం ద్వారా అందరూ ఆ వ్యాధికి అడ్డుకట్ట వేయవచ్చునన్నారు. రక్తమార్పిడి సమయంలో, పరీక్షలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని వైద్యసిబ్బందికి సూచించారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవీపై పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి దుర్గారావుదొర మాట్లాడుతూ ప్రాణాంతకంగా ఉన్న హెచ్ఐవీ వ్యాధిని అవగాహనతో అరికట్టాలన్నారు. 2030 నాటికి ఈ వ్యాధిని అంతంచేయాలని పిలుపునిచ్చారు. ఐఎంఏ ఏపీ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ పీఎస్ శర్మ, అదనపు డీఎంహెచ్‌వో భరతలక్ష్మి, ఓఎస్సీసీ ప్రతినిధి జెయేష్‌కుమార్, డాక్టర్ అనూషవిహారీ, జనకల్యాణ్, ఎన్జీవోల ప్రతినిధులు పాల్గొన్నారు. వ్యాధి నియంత్రణ చర్యల్లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులు, ఓన్జీవో ప్రతినిధులకు కలెక్టర్ జ్ఞాపికలను అందజేశారు.



కలెక్టరేట్ ఎదుట ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

'మండపేట'ను కోనసీమలోనే కొనసాగించాలి

» చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

అమలాపురం,డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కోనసీమలోనే మండపేటను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పీజీఆర్ఎస్‌లో అర్జీ అందించారు. కోనసీమ జిల్లాలో ప్రస్తుతం పరిశ్రమల పరంగా అభివృద్ధి చెందిన ప్రాంతంగా మండపేట మాత్రమే ఉందన్నారు. మండపేటను ఇప్పటికే ఎన్నో రకాలుగా అభివృద్ధి చెంది రైల్వేస్టేషన్, ఎయిర్‌పోర్టు, హోల్‌సేల్ వ్యాపారాలు, కెమికల్ ఫ్యాక్టరీలు వంటి ఎన్నో ఉన్న తూర్పుగోదావరిలో కలపడం తగదన్నారు. కోనసీమ ప్రాంతంలో రైతుల శ్రమ తప్ప ఏ ఇతర పరిశ్రమలు లేవని గుర్తించాలన్నారు. మండపేటలో 150కు పైగా రైసు మిల్లులు, ఆయిల్ మిల్లులు, కోళ్ల పరిశ్రమలు వంటివి ఉన్నాయని, వాటిని తూర్పుగోదావరిలో విలీనం చేయడం సమంజసం కాదని అన్నారు. కోనసీమ ప్రజల ఆవేదనను సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచలప్రసాద్, ముఖ్య సలహాదారులు కంచిపల్లి అబ్బులు, నల్లా పవన్‌కుమార్, గోల్డ్‌మార్కెట్ అధ్యక్షుడు ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి యర్రంశెట్టి నారాయణమూర్తి, స్వర్ణకారుల సంఘ అధ్యక్షుడు మాసేపల్లి ప్రకాష్, పట్నాల వెంకటరమణ, కొవ్వూరి వెంకటరెడ్డి, వలవల శివరావు, అరిగెల నాని, గోకరకొండ గంగన్నస్వామినాయుడు ఉన్నారు.



కాకినాడ జిల్లా పిఠాపురంలోని బాదం మాధవరావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

'దశ' మారేలా!

పదో తరగతి పరీక్షలకు విద్యా శాఖ విద్యార్థులను సన్నద్ధం చేస్తోంది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మార్చి 16 నుంచి జరగనున్న పరీక్షలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే పలు పాఠశాలల్లో సిలబస్ పూర్తి చేయగా, ప్రత్యేక పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంగా వంద రోజుల ప్రణాళికను ఈ నెల ఆరో తేదీ నుంచి అమలు చేయనున్నారు. దీనిని పక్కాగా చేపట్టాలని ఎంఈవోలు, డీవైఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు ఈ పదునైన ప్రణాళిక ఉపయోగపడాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారు. ఈ ఏడాది కాకినాడ జిల్లాలో 29,866 మంది పరీక్షలకు హాజరుకానున్నారు.

- పదో తరగతి ఉత్తీర్ణతపై ప్రత్యేక శ్రద్ధ
- వంద రోజుల ప్రణాళికను సిద్ధం చేసిన కాకినాడ జిల్లా విద్యా శాఖ
- సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ఫోకస్
- హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు పర్యవేక్షణ బాధ్యత
- స్లో లెర్నర్స్ కోసం స్టడీ మెటీరియల్ అందజేత





కాకినాడ జిల్లా గొల్లప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాయంత్రం పునశ్చరణ తరగతులను పరిశీలిస్తున్న ఎంఈవోలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పదో తరగతి పరీక్షల ఫలితాల్లో జిల్లా వెనుకబడుతోంది. గత ఏడాది విడుదలైన ఫలితాల్లో 15వ స్థానంలో నిలిచింది. ఉమ్మడి జిల్లాలో ఒకప్పుడు రెండు, మూడు స్థానాల్లో ఉండే ఫలితాలు దిగజారిపోవడం ఆందోళన కలిగించే అంశం. అయితే ఈ సారి ఆ పరిస్థితి లేకుండా టాప్-5లో ఉండేలా విద్యాశాఖాధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంగా ఈ నెల నుంచి వంద రోజుల కార్యచరణ అమలు చేయనున్నారు. ఇందులో ప్రధానంగా విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ ఇప్పటికే ఆదేశించారు. ప్రతి విద్యార్థినీ సంబంధిత ఉపాధ్యాయులు దత్తత తీసుకుని వారి అభ్యసన స్థాయిని నిరంతరం పరిశీలించాలని కోరారు. ఏదైనా సబ్జెక్టులో వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు, పునశ్చరణ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థీ తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించేలా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మండల, జిల్లా స్థాయి విద్యాశాఖాధికారులు నిత్యం పాఠశాలలను సందర్శించి, బోధనా విధానం, విద్యార్థుల అభ్యసన స్థాయిలపై సూచనలు జారీ చేస్తున్నారు. స్లో లెర్నర్స్ కోసం ఇప్పటికే స్టడీ మెటీరియల్‌ను ప్రతి పాఠశాలకు అందించారు.

'పది' ఫలితాలకు పదునైన సూత్రాలు..

- జిల్లావ్యాప్తంగా ఏటా ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉన్న పాఠశాలల్లో బోధనను విద్యాశాఖాధికారులు నిత్యం పర్యవేక్షించేలా, ప్రతిరోజూ పాఠశాలను సందర్శించేలా ఆదేశాలిచ్చారు.
- విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.
- పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి బోధన తీరు మెరుగుపరిచేందుకు కృషి చేయాలి.
- కష్టమైన గణితం, ఇంగ్లిష్, సైన్స్ బోధన ఎలా సాగుతోందో పక్కాగా పరిశీలించాలి.



కాకినాడ జిల్లా గండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సూచనలిస్తున్న డీఈవో రమేష్

- ఆయా పాఠ్యాంశాలను బోధించే ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా పరీక్షల్లో తప్పకుండా వస్తాయని భావించే ప్రశ్నలను విద్యార్థులకు బోధించాలి.
- పరీక్షల్లో తప్పకుండా ఇస్తారని భావించే ప్రశ్నలను విద్యార్థులు సులువుగా అర్థం చేసుకుని రాసేలా మెరుగైన శిక్షణ ఇవ్వాలి.
- చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి వారు ప్రతి సబ్జెక్టులోనూ ఉత్తీర్ణులయ్యేలా తీర్చిదిద్దాలి.
- పరీక్షల్లో తప్పక వస్తాయని భావించే ప్రశ్నలను ప్రతిరోజూ విద్యార్థులతో చూడకుండా రాయించాలి. హోం వర్క్ ఇవ్వాలి.
- ఉపాధ్యాయులు ప్రతివారం విద్యార్థుల సామర్థ్యానికి సంబంధించిన నివేదికను రూపొందించి వారికి ఇవ్వాలి.
- బాగా వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకుని శిక్షణ ఇవ్వాలి. ప్రతి వారం విద్యార్థులు ఎన్ని మార్కులు సాధిస్తారనే విషయంపై పాఠశాల హెచ్ఎం నివేదిక రూపొందించాలి.
- బొమ్మలు గీయడం, మ్యాప్ పాయింటింగ్, గ్రాఫ్ తదితర అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి పరీక్షలకు సమాయత్తం చేయాలి.

గత కొన్నేళ్లుగా ఫలితాలు ఇలా...

సంవత్సరం	విద్యార్థుల హాజరు	ఉత్తీర్ణులు	ఉత్తీర్ణత శాతం
2021-22	66,175	46,579	65.83
2022-23	27,358	18,608	68.02
2023-24	27,671	22,993	83.09
2024-25	27,368	22,508	82.24



మూఢం

శుభ కార్యాలకు విరామం

- ఫిబ్రవరి 17 వరకు శుక్ర మౌఢ్యమి
- మూడు నెలలు ముహూర్తాలు లేవు
- పలు రంగాలపై ఆర్థిక ప్రభావం

పెద్దాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రహాల స్థితిని బట్టి కర్మ కాలాలు లేదా మూఢమి లాంటివి జ్యోతిష శాస్త్రం ద్వారా వినిపించే మాటలు. ఈసారి దాదాపు మూడు నెలల పాటు శుభ ముహూర్తాలకు విరామం రానుంది. మార్గశిర శుద్ధ షష్ఠి (నవంబరు 26)న ప్రారంభమైన శుక్ర మౌఢ్యమి మాఘ బహుళ అమావాస్య (ఫిబ్రవరి 17) వరకు కొనసాగనుంది. దీంతో 83 రోజుల పాటు శుభ ముహూర్తాలు లేవు.

మార్గశిర, మాఘ, ఫాల్గుణ మాసాల్లో శుభ కార్యాలు అధికంగా జరుగుతాయి. ఈసారి మార్గశిరంలో ఒకటి, రెండు ముహూర్తాలు ఉండగా పుష్య మాసం శూన్య మాసం అవుతుంది. ఇక మాఘంలో ఒక్క ముహూర్తం కూడా లేకపోవడం గమనార్హం. గృహ ప్రవేశాలకు అనుకూలమైన రథసప్తమి, సరస్వతీదేవి జన్మదినమైన వసంతపంచమి, మహా మాఘిగా కీర్తించబడే మాఘ పౌర్ణమి... ఈసారి మూఢంలోనే కలిసిపోతాయి.

మూఢం అంటే...

జ్యోతిష శాస్త్రం ప్రకారం ఒక గ్రహం సూర్యుడి కిరణాల్లో కనుమరుగైపోవడమే మౌఢ్యమి. వాడుక భాషలో మూఢమి అంటే చీకటి. శుభకార్యాలకు గురుడు ఎంత ప్రధాన కారకుడో శుక్రుడు కూడా అంతే ప్రభావం కలవాడు. గ్రహశక్తులు బలహీనమవ్వడంతో శుక్ర గ్రహం సూచించే ఫలితాలు అంతగా అనుకూలంగా ఉండవు. శుక్రుడు బలహీనం అయితే సంబంధాలు, వివాహ జీవితం, ఆర్థిక స్థిరత్వంలో ప్రతికూలతలు ఏర్పడతాయని జ్యోతిషులు చెప్తున్నారు. అందుకే శుక్ర మౌఢ్యమి ఉన్న కాలంలో శుభకార్యాలు జరిపించడం శుభసూచకం కాదంటారు.

వ్యాపారులపై ప్రభావం...

శుభకార్యాలు లేకపోతే వివాహ మండపాలు, ఫంక్షన్ హాళ్లు, వస్త్ర, ఆభరణాల దుకాణాలు, స్వర్ణకారులు, క్యాటరింగ్, ఫొటో, వీడియోగ్రాఫర్లు, టెంట్ హౌస్, పూల దుకాణాలు, లైటింగ్, డీజేలు, అద్దె కార్లు, బస్సులు, సన్నాయి మేళాలు... ఇలా సంబంధిత వర్గాల వారు నెలల కొద్దీ నష్టపోవాల్సి వస్తుంది. పౌరోహిత్యంపై ఆధారపడ్డ వారికి గడ్డుకాలమే.

శుభ కార్యాలు చేయకూడదు



వచ్చే ఏడాది ఫిబ్రవరి 17 వరకు దాదాపు మూడు నెలలు శుభ కార్యాలకు మంచి రోజులు లేవు. శుక్ర మౌఢ్యమి వల్ల ఒక్క ముహూర్తం కూడా ఉండదు. గృహ ప్రవేశాలు, విగ్రహ ప్రతిష్ఠాపనలు కూడా చేసుకోకూడదు.

చింతా గోపీశర్మ సిద్ధాంతి
పెద్దాపురం, కాకినాడ జిల్లా

డొంకరాయి నుంచి వాటర్ కట్

- రెండు నెలలపాటు నీరు నిలుపుదల
- ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ రాజారావు



డొంకరాయి పవర్ కెనాల్, జెన్కో చీఫ్ ఇంజనీర్ రాజారావు

మోతుగూడెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్సు పరిధిలోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి నీటిని సరఫరా చేసే డొంకరాయి పవర్ కెనాల్ నుంచి నీటి విడుదలను రెండు నెలల పాటు నిలిపివేస్తున్నట్టు సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ కేవీ రాజారావు తెలిపారు.ఆయన సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న 115 మెగావాట్ల సామర్థ్యం (ఒక్కొక్కటి) గల 5, 6 యూనిట్లకు కమీష నింగ్ పనుల్లో భాగంగా ఫోర్‌బే డ్యాం నుంచి పెన్‌స్టాక్ పైపులైన్ ద్వారా నీరు పంపడానికి అవసరమైన వాటర్ కండక్టర్ సిస్టంను ఫోర్‌బే ఇంటెక్ వద్ద ఏర్పాటు చేయాలని, ఈ పనులు చేయాలంటే డొంకరాయి పవర్ కెనాల్ నుంచి వచ్చే నీటి విడుదలను పూర్తిగా నిలిపి వేయాలని సీఈ తెలిపారు. దీని కోసం డిసెంబరు 2 నుంచి రెండు నెలల పాటు ఏపీ జెనోకో గ్రిడ్ ఉన్నతాధికార్ల నుంచి ఎల్‌సీ అనుమతులు తీసు కున్నామని ఆయన తెలిపారు. ఈ రెండు నెలలు పాటు పొల్లురు, డొంకరాయి జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. అలాగే ఈ షట్‌డౌన్ సమయంలో పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలోని నాలుగు యూనిట్లకు కొన్ని ఆపరేషన్ మెంటెనెన్సు పనులు చేయడానికి ప్రతిపాదనలు చేశామన్నారు. అలాగే డొంకరాయి జలవిద్యుత్ కేంద్రంలో యూనిట్ క్యాపిటల్ ఓవరాలింగ్ పనులను నిర్వహించనున్నామని చెప్పారు. సీలేరు కాంప్లెక్సు పరిధిలో 2నెలలు పాటు విద్యుత్ డిమాండ్ మేరకు గ్రిడ్ అధికార్ల ఆదేశాలతో ఎగువ సీలేరు జల విద్యుత్ కేంద్రంలో మాత్రమే విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని జెన్కో చీఫ్ ఇంజనీర్ రాజారావు తెలిపారు.

జాతీయ ఖోఖో పోటీలకు జట్ల ఎంపిక

- నెలాఖరున రాజస్థాన్‌లో పోటీలు
- ఏపీ నుంచి 2 జట్లు పాల్గొంటాయి
- ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు



జాతీయ ఖోఖో పోటీలకు ఎంపికైన బాలుర జట్టు

లంకెలపాలెం (అనకాపల్లి జిల్లా), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-14 బాలుర, బాలికల జాతీయ స్థాయి ఖోఖో జట్లను అనకాపల్లి జిల్లా లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం రాత్రి ఎంపిక చేశారు. మూడు రోజులు పాటు ఇక్కడ జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచిన సంగతి తెలిసిందే. ఈ పోటీల్లో విశేషంగా రాణించిన క్రీడాకారులను ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెలాఖరులో రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో ఏపీ నుంచి రెండు జట్లు పాల్గొంటాయని ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. కాగా ఎంపికైన క్రీడాకారులను జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు, కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కేఎం నాయుడు, హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి ఎంవీ. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోటీలకు ఎంపికైన బాలుర జట్టు

జె.హర్షవర్ధన్ (విశాఖపట్నం), జి.మనోహర్ నాయుడు (విశాఖపట్నం), టి.సూర్యనారాయణ (చిత్తూరు), ఎస్.బద్రీనాథ్ (చిత్తూరు), టి.శృతిసాయి కీర్తన్ (విశాఖపట్నం), ఎం.శ్రీకాంత్ (గుంటూరు), సి.నగేష్ (కర్నూలు), కె.వెంకట సాయి (ప్రకాశం), ఎ.భూపతిరెడ్డి (తూర్పుగోదావరి), బి.కార్తీక్ (శ్రీకాకుళం), ఎస్.రామ్‌చరణ్ (కడప), కె.చరణ్ (విశాఖపట్నం) ఎంపికయ్యారు.

బాలికల జట్టు

ఆర్.శృతిక (విశాఖపట్నం), ఆర్.లలితాదేవి (విశాఖపట్నం), ఎం.యువశ్రీ (చిత్తూరు), పి.జయశ్రీ (చిత్తూరు), ఎన్.అర్చనారెడ్డి (చిత్తూరు), జి.చందన (శ్రీకాకుళం), కె.పావని (విజయనగరం), టి.సింధు (ప్రకాశం), ఎన్.బంధవిక (కృష్ణా), జి.అనుపమ (కడప), ఆర్.వీణ (అనంతపురం), టి.ప్రియ (తూర్పుగోదావరి) ఎంపికైనట్టు ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు తెలిపారు.



జాతీయ ఖోఖో పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

డాక్టర్ మంజూషకు టైమ్స్ గ్రూప్ పురస్కారం

సర్వీస్ ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం



నటుడు అనుపమ్‌ఖేర్ నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ మంజూష

పిఠాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఎంఎస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ గైనకాలజిస్టు డాక్టర్ సలాది మంజూషకు ప్రతిష్ఠాత్మకమైన టైమ్స్ గ్రూప్ పురస్కారం లభించింది. 2025 సంవత్సరానికి సంబంధించి టైమ్స్ ఎక్సలెన్స్ హెల్త్ 6వ ఎడిషన్‌లో సర్వీస్ ఎక్సలెన్స్ ఇన్ గైనకాలజీ అండ్ ఉమెన్స్ హెల్త్ కేర్‌లో ఆమెకు ఈ పురస్కారాన్ని ప్రకటించారు.హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో మంజూషకు ఈ అవార్డును ప్రముఖ హిందీ నటుడు అనుపమ్‌ఖేర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

స్కాట్ జంబోరీలో శ్రీహర్షకు నేషనల్ అవార్డు

తాళ్లపూడి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామానికి చెందిన గుమ్మడి శ్రీహర్ష లక్నోలో జరిగిన భారత స్కాట్ అండ్ జంబోరీలో నేషనల్ కాంపిటీషన్‌కు హాజరై అవార్డు సాధించాడు. శ్రీహర్ష న్యూ ఆరుగొలను బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. కాగా ఈ పాఠశాలలో తొమ్మిది మంది విద్యార్థులకు అవార్డులు రావడంతో పలువురు గ్రామస్థులు వారికి అభినందనలు తెలిపారు.



మహా సంస్థానంలో దత్తాత్రేయ స్వామికి తులసి అర్చన

మహా సంస్థానంలో వైభవంగా లక్ష తులసి అర్చన

పిఠాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధిగాంచిన కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో జరుగుతున్న శ్రీపాద జయంతి సప్తాహ మహోత్సవాల్లో నాలుగో రోజైన సోమవారం విశేష పూజలు జరిగాయి. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులకు లక్ష తులసి అర్చన నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో రుత్వికులు తులసిదళాలతో అర్చన చేశారు. అనంతరం స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. అంతకు ముందు మహాగణపతి పూజ, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాద పద్మాలకు మహన్యాసపూర్వక ఏకాదశ శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తాలతో సహస్ర నామార్చన, రుత్వికులచే దత్తమూలమంత్ర అనుష్ఠానము, సాయంత్రం అగ్నిప్రతిష్ఠాపన, దత్త మంత్రహోమం నిర్వహించి వివిధ హారతులు ఇచ్చారు. స్వామికి సాయంత్రం పల్లకీ సేవ కనుల పండువగా జరిగింది. ఈవో ఆర్.సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. పాదగయ క్షేత్రంలో స్వయంభూవుగా వెలసిన దత్తాత్రేయస్వామికి సహస్ర గులాబీ అర్చన నిర్వహించారు. పండితులు వేదమంత్రోచ్చారణలతో అర్చన జరిపించి దత్తాత్రేయ స్వామిని అలంకరించారు. మహాగణపతి పూజ, కలశ స్థాపన, రుత్విక్‌వరుణలు, పంచామృత సహిత రుద్రాభిషేకం, సహస్రనామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, రుత్విక్కులచే దత్తమాల మంత్ర అనుష్ఠానం, అగ్నిప్రతిష్ఠాపన, దత్తమూల మంత్రహోమాలు, మంగళహారతి నిర్వహించారు. ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్, సూపరింటెండెంట్ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.



పాదగయ క్షేత్రంలో పుష్పాలంకరణలో స్వయంభూ దత్తాత్రేయ స్వామి



శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో లక్ష తులసి అర్చన నిర్వహిస్తున్న రుత్వికులు

క్రీడలతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

ఎమ్మెల్యే పంతం నానాజీ.. కాకినాడలో అంతర్ జిల్లాల స్కేటింగ్ చాంపియన్‌షిప్



స్కేటింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. సోమవారం కాకినాడ వివేకానంద పార్క్ ఆవరణలోని స్కేటింగ్ రింక్‌లో 69వ అంతర్ జిల్లాల స్కేటింగ్ చాంపియన్‌షిప్ అండర్-11, 14, 17, 19 క్యాటగిరిల్లో టోర్నమెంట్ కం సెలెక్షన్ నిర్వహించారు. దీనికి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.సుధారాణి, అడ్మిన్ సెక్రటరీ కె.శ్రీనివాస్, డీఈవో పి.రమేష్, శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత శ్యామ్, ఆర్ఐపీఈ జాన్సన్, డీవైఈవో సత్యనారాయణ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. పోటీలకు 13 జిల్లాల నుంచి సుమారు 450 పిల్లలు పాల్గొన్నారు. 50 మంది పీడీలు, 20 మంది టెక్నికల్ అఫీషియల్స్ పోటీలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హాకీ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి వి.రవిరాజ్, లంక జార్జ్, పరశురాము, సూరిబాబు, సురేష్ రాజు పాల్గొన్నారు.



వినూత్న ఆవిష్కరణలపై జేఎన్టీయూలో ఎఫ్‌డీపీ



జ్యోతిప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

జేఎన్టీయూకే, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూలోని అలూమ్ని ఆడిటోరియంలో స్కూల్ ఆఫ్ ఫార్మా స్యూటికల్ సైన్సెస్ టెక్నాలజీస్, ఐఎస్‌టీ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ వరకు నిర్వహించే సదస్సుకు ఉప కులపతి సీఎస్‌ఆర్కే ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఐఎస్టీ డైరెక్టర్ బీటీ కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సును సోమవారం ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వివిధ పరిశోధన, శాస్త్ర సంబంధ అంతర విభాగ రంగాల ప్రయోజనాలను వివరించారు. అనంతరం డాక్టర్ బీకే సాహు ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ టీబీ వ్యాక్సిన్ ఆవిష్కరణను తెలిపారు.ప్రొఫెసర్ రవికుమార్ ఔషధ పంపిణీ వ్యవస్థల గుణాలు, చెడు ప్రభావాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

దేవరపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం సాయంత్రం ఏకాదశి సందర్భంగా స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సూతాపల్లి రామారావు దంపతులు పీటలపై కూర్చోగా ఆలయ ప్రధాన అర్చకులు కేశవాచార్యులు, దుర్గాప్రసాద్ ఆచార్యులు ఈ కల్యాణోత్సవాన్ని వేద మంత్రాలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు. ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ఐవీఆర్ఎస్ సర్వేలో
‘అన్నవరం’ ఆరో స్థానం

కొనసాగుతున్న భక్తుల అసంతృప్తి

అన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రధానాలయాల్లో భక్తులకు అందుతున్న సౌకర్యాలపై ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవీఆర్ఎస్ సర్వేలో కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానానికి భక్తుల నుంచి అసంతృప్తి శాతం కొనసాగుతుంది. సోమవారం ప్రభుత్వం విడుదల చేసిన సర్వేలో అన్నవరం దేవస్థానం 69.7 శాతంతో ఆరోస్థానంలో నిలిచింది. 73.8 శాతంలో ద్వారకా తిరుమల మొదటిస్థానంలో ఉండగా 67.9 శాతంతో విజయవాడ చివరిస్థానంలో నిలిచింది. అన్నవరం ప్రసాదం నాణ్యత, రుచి విషయంలో 77.6 శాతం బాగుందని తెలిపారు. ఈ విషయంలో అన్నవరం దేవస్థానం 5వ స్థానం, శానిటేషన్ నిర్వహణలో 64.2 శాతం మంది బాగుందని చెప్పడంతో ఆరోస్థానంలో ఉంది. ఏడు ప్రధాన దేవాలయాల్లో అక్టోబరు 25 నుంచి నవంబరు 25 వరకు చేపట్టిన సర్వేలో ఈ గణాంకాలను విడుదల చేశారు. దర్శనం సంతృప్తిగా జరగడం, తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పన, ప్రసాదం రుచి, నాణ్యత, పారిశుధ్యంపై ప్రతినెలా ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహిస్తుంది.

సామర్లకోట రైల్వే గూడ్స్ యార్డుకు
3,200 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి



సామర్లకోటలో దిగుమతి అవుతున్న ధాన్యం

సామర్లకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే గూడ్స్ యార్డుకు కృష్ణా జిల్లా గుడివాడ నుంచి ప్రత్యేకంగా రెండు గూడ్స్ రైళ్ల ద్వారా 3,200 మెట్రిక్ టన్నుల మేర ధాన్యం రెండు రోజులుగా దిగుమతి అయ్యింది. సామర్లకోట ఏడీబీ రోడ్డులోని ఒక ప్రముఖ రైస్‌మిల్లు ఈ ధాన్యాన్ని దిగుమతులు చేసుకున్నట్టు రైల్వే పార్సిల్ వర్గాల ద్వారా తెలిసింది. పొరుగు రాష్ట్రాలైన బీహార్, పంజాబ్ తదితర రాష్ట్రాల నుంచి ఇక్కడకు ధాన్యం దిగుమతులు కావడం సహజంగా వస్తున్నప్పటికీ మొట్టమొదటిసారిగా కృష్ణా జిల్లా గుడివాడ నుంచి రెండు రైళ్ల ద్వారా 3,200 మెట్రిక్ టన్నుల మేర ధాన్యం దిగుమతులు కావడం విశేషం. ధాన్యం దిగుమతుల కోసం రైల్వేకు రవాణా చార్జీలుగా రూ.28 లక్షల ఆదాయం సమకూరింది. దీంతో సామర్లకోటకు చెందిన 100 లారీలకు దిగుమతులు, ఎగుమతుల ద్వారా సుమారు రూ.5 లక్షల మేర రవాణా చార్జీలగానూ, 150 మంది కూలీలకు మరో రూ.5 లక్షలమేర హమాలీ జట్టు కూలీలకు ఉపాధి లభించినట్లైంది.

70 శాతం ఆన్‌లైన్..

- అన్నవరం దేవస్థానం సత్రం గదుల్లో 70 శాతం ఆన్‌లైన్ ద్వారా కేటాయింపు
- పర్వదినాలు, వివాహాల సమయంలో సిఫార్సు లేఖలకు స్వస్తి
- పెరిగిన సత్రం గదుల అద్దె రేట్లు అమలు



రత్నగిరిపై సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం

అన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో ఉన్న సత్రంగదుల్లో 70శాతం గదులను ఆన్‌లైన్‌లో ఉంచాలనే దేవదాయశాఖ ఆదేశాలను సోమవారం నుంచి అధికారులు ఆచరణలో పెట్టారు. దేవస్థానంలో సుమారు 470 గదులు అందుబాటులో ఉండగా వీటిలో 70 శాతం గదులు అంటే సుమారు 330 గదులను భక్తులు ఆన్‌లైన్ ద్వారానే బుకింగ్ చేసుకోవచ్చు. మిగిలిన 30శాతం గదులు వివాహాలకు దేవస్థానం అడ్వాన్స్ రిజర్వేషన్ చేయనున్నట్టు అధికారులు వెల్లడించారు. దీంతో భక్తులు క్యూలైన్‌లలో ఉండి పడిగాపులు పడాల్సిన అవసరం ఉండదని దేవదాయశాఖ ఆలోచనగా తెలుస్తుంది. మరోపక్క పర్వదినాల్లో గదులు దళారులు చెంత కు వెళ్తున్నాయనే ఆరోపణలకు చెక్ పడనుంది. ఒక మెయిల్ ఐడీతో కేవలం 2గదులు మాత్రమే ఆన్‌లైన్‌లో బుక్ అయ్యేవిధంగా తిరిగి ఆ మెయిల్ ఐడీ ద్వారా 2 నెలల పాటు బుకింగ్ చేసుకోవడానికి వీలులేకుండా సిస్టమ్‌ను అప్‌డేట్ చేశారు. ఇదిలా ఉండగా వివాహాల సమయంలో, కార్తీకమాసం వంటి పర్వదినాల్లో సిఫార్సు లేఖలు కుప్పలుతెప్పలుగా వచ్చిపడి దేవస్థానం అధికారులకు శిరోభారంగా మారుతుంది. ఆన్‌లైన్ విధానంతో సిఫారస్‌లేఖలకు కత్తెరపడనుంది. మరోపక్క సత్రంగదులకు పెంచిన అద్దె ధరలు సోమవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. ప్రకాష్‌సదన్ అద్దె జీఎస్టీతో కలిపి రూ.1260, న్యూ, ఓల్డ్ సెంటినరీ గదులు రూ.700, హరిహరసదన్ నాన్‌ఏసి రూ.800, ఏసీ గదులు జీఎస్టీతో కలిపి రూ.1500 చెల్లించాల్సి ఉంటుంది. శివసదన్ కాటేజీ అద్దెలను యథాతథంగా ఉంచారు.

అన్నవరం దేవస్థానానికి
పెంకుటిల్లు విరాళం



ఇంటిపత్రాలు ఈవోకు అందజేస్తున్న దాత

అన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం గ్రామానికి చెందిన ఒకదాత అన్నవరం దేవస్థానానికి ప్రభుత్వ విలువ రూ.3.82 లక్షలు, మార్కెట్ విలువ రూ.40 లక్షల విలువైన 98.51 చదరపు గజాల పెంకుటిల్లును విరాళంగా అందజేశారు. లింగంపల్లి వెంకట సూర్య సత్యనారాయణ దీనికి సంబంధించి పత్రాలను సోమవారం ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా ఆయన అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి సోమవారం విశాఖపట్నంకు చెందిన కె.శ్రీనివాస్ రూ.లక్ష విరాళాన్ని ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేశారు. ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు



విరాళం అందజేస్తున్న దాత

ఇసుక తిప్పలో గుర్తుతెలియని మృతదేహం



పోలీసులు గుర్తించిన మృతదేహం

ఆలమూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ వద్ద గౌతమి కొత్త బ్రిడ్జి 11-12 ఫిల్లర్స్‌కు మధ్యలో గోదావరి ఇసుక తిప్పలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆలమూరు పోలీసులు గుర్తించారు. అతడు బ్రిడ్జిపై నుంచి దూకేశాడా.. లేక బ్రిడ్జి కిందకు వచ్చి ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయం నిర్ధారణ కావడం లేదని ఎస్ఐ జి.నరేష్ తెలిపారు. వ్యక్తి వయస్సు 55ఏళ్ల ఉంటాయన్నారు. వివరాలు తెలిస్తే 9440904849కి సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



మృతిచెందిన శివ సూర్యనారాయణ

గండేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇనుప ఊసలు 11 కేవీ విద్యుత్ వైర్లకు తగిలి షాక్‌కు గురై యువకుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం కె.సూరంపాలెం గ్రామానికి చెందిన వాసంశెట్టి శివ సూర్యనారాయణ (24) తాపీ పని చేస్తున్నాడు. పి.నాయకంపల్లి గ్రామానికి చెందిన తాళ్లూరి శ్రీను ఇంటి డాబాపై పిట్టగోడ కట్టుకునేందుకు ఐరన్ ఊసలను మేడ పైకి తెచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు ఇంటిపై ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లు ఐరన్ ఊసలకు తగిలి విద్యుత్ షాక్‌తో సూర్యనారాయణ మృతి చెందాడు. మృతుడి మేనమామ కడియం వీర సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐ.పోలవరంలో...

ఐ.పోలవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరానికి చెందిన కోడూరి వెంకటేష్(33) సోమవారం విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న వెంకటేష్ సోమవారం విధి నిర్వహణలో విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు అతనిని టి.కొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకటేష్ మృతిచెందాడు. అతడిమృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బైక్స్ దొంగిలిస్తున్న ఇద్దరి అరెస్ట్

రూ.2.20 లక్షల విలువైన మూడు మోటార్‌సైకిళ్లు స్వాధీనం



నిందితులతో సీఐ సత్యనారాయణ బృందం

కాకినాడ క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా మోటారు సైకిళ్లు దొంగిలిస్తున్న ఇద్దరిని కాకినాడ త్రీటౌన్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ2.20 లక్షల విలువైన 3 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఇటీవల కాకినాడ మయూరి థియేటర్ పక్క సందులో, సినిమారోడ్డులో ద్విచక్ర వాహనాలు చోరీ అవుతున్నాయని వచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కెవిఎస్.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్థానిక పగడాలపేటకు చెందిన గేదెల అంజిబాబు(23), బల్లబ్బాయి రెడ్డి కాలనీకి చెందిన (19) బుద్దా వెంకటేశ్‌ను అరెస్ట్ చేసి 3 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రాజానగరం పోలీసులు

ట్రాన్స్‌ఫార్మర్స్‌లో కాపర్ వైర్ల చోరీ

నలుగురి అరెస్ట్

రూ.2 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

రాజానగరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్స్‌లో కాపర్ వైర్లను చోరీచేస్తున్న దొంగలు ఎట్టకేలకు రాజానగం పోలీసులకు చిక్కారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కానవరంలోని కొప్పిశెట్టి వీరబాబు అనే రైతు పామాయిల్ తోటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, కేబుల్ వైర్లను గతనెల 21న గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. దీనిపై బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టగా కొంతమూరు గ్రామానికి చెందిన పొడుగు వంశీ, బిక్కవోలు శివకుమార్, షేక్ మైసుద్దీన్, కోలమూరు గ్రామానికి చెందిన మాసిగిరి దుర్గయ్యను నిందితులుగా గుర్తించి అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ జీవీవీ సత్యనారాయణ నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 21 కేసులకు సంబంధించి 35 ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి గురైన 120 కిలోల కాపర్ వైర్ల దిమ్మలు స్వాధీనం చేసుకున్నారు. చోరీ సొత్తు విలువ రూ.2 లక్షలు ఉంటుందన్నారు.

మోటార్‌సైకిల్ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

గండేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా మురారి-గండేపల్లి మధ్యలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి మోటార్ సైకిల్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు గండేపల్లి ఎస్ఐ శివ నాగబాబు తెలిపారు. మృతుడి వివరాలు తెలియలేదన్నారు. మృతదేహాన్ని జెడ్.రాగంపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారు. సమాచారం తెలిసినవారు గండేపల్లి పోలీస్ స్టేషన్‌కి తెలియజేయలన్నారు. ఈ ఘటనపై వీఆర్వో నుంచి వివరాలు తీసుకుని కేసు నమోదు చేయడం జరిగిందని తెలియజేశారు.

అనుమానమే పెనుభూతమై...

- గచ్చుపలకరాయితో కొట్టి భార్యను చంపి పరారైన భర్త
- ఇంద్రపాలెంలో సంఘటన
- కొడుకు ఫిర్యాదుతో కేసు నమోదు



మరణించిన బేతా మల్లేశ్వరి



భర్త గంగరాజు

కాకినాడ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో మద్యం మత్తులో తలపైన గచ్చుపలకరాయితో భర్త గట్టిగా కొట్టడంతో మరణించిన సంఘటన ఇంద్రపాలెంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెంలోని పిల్లకాలువ రోడ్డులో గల గొల్లపేట 2వ వీధిలోని ఓ ఇంట్లో అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం వేములపూడికి చెందిన బేతా మల్లేశ్వరి(47), గంగరాజు దంపతులు అద్దెకు ఉంటున్నారు. వారికి ఒక అమ్మాయి, ఒక అబ్బాయి సంతానం. కుమార్తెకు వివాహం కావడంతో స్వామినగర్‌లో వారు నివసిస్తున్నారు. కుమారుడు గణేష్ మెకానిక్‌గా పనిచేస్తూ తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. అయితే కొదిరోజులుగా దంపతుల మధ్యగొడవలు జరుగుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి సమయంలో కూడా వారిద్దరూ ఘర్షణ పడ్డారు. మద్యంమత్తులో ఉన్న గంగరాజు భార్యపై అనుమానంతో తలపైన గచ్చుపలకరాయితో గట్టిగా కొట్టడంతో ఆమె మరణించింది. తర్వాత భర్త తన సెల్‌ఫోన్, చెప్పులు, దుస్తులను ఇంట్లోనే వదిలేసి పరారయ్యాడు. అపస్మారకస్థితిలో ఉన్న తల్లిని కొడుకు కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సీఐ చైతన్యకృష్ణ, ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు సోమవారం సంఘటన జరిగిన ఇంటిని పరిశీలించి మృతురాలి కుటుంబ సభ్యులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించగా క్లూస్ టీమ్ పరిశీలించింది. మార్చురీలో ఉన్న మల్లేశ్వరి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మల్లేశ్వరి కొడుకు గణేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

విద్యార్థులపై హెచ్ఎం కులవివక్ష

తల్లిదండ్రుల ఆందోళన

కొత్తపల్లి మండలం యండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంఘటన

కొత్తపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులపై కులవివక్షత చూపుతూ, వారి తల్లిదండ్రులను చులకన చేసి మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడుపై చర్యలు చేపట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనకు సీఐటీయూ నాయకుడు సీహెచ్.సాంబ, ఐద్వా నాయకురాలు శీలం అప్పలరాజు మద్దతు తెలిపారు. ఈ సంఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం యండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగింది. పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జీ.సురేష్ బోస్ విద్యార్థుల మధ్య కులవివక్షత చూపుతూ అగ్రకులాలలకు చెందిన విద్యార్థులను చులకనగా మాట్లాడుతున్నాడని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. బాలికల పట్ల అసభ్యకరంగా మాట్లాడుతున్నాడని ఆరోపించారు. అంతేకాకుండా బాలికలకు బాలురతో లేనిపోని సంబంధాలను అంటగడుతున్నాడని వాపోయారు. విషయం తెలుసుకున్న కొత్తపల్లి మండల విద్యాశాఖాధికారులు బుర్రా వేణుగోపాల్, పైడిరాజు, ఎస్ఐ జి.వెంకటేష్ ఉన్నత పాఠశాలకు చేరుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించారు. ఇక మీదట పాఠశాలలో విద్యార్థుల విషయంలో ఎటువంటి వివక్షత లేకుండా చర్యలు తీసుకుంటామని ఎంఈవోలు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అదేవిధంగా ప్రధానోపాధ్యాయుడు కులవివక్షత చూపడం, అసభ్యకరంగా మాట్లాడుతున్నాడనే ఆరోపణలపై విచారణ నిర్వహించి శాఖాపరమైన చర్యలు చేపట్టనున్నట్టు ఎంఈవో-1 వేణు గోపాల్ తెలిపారు.



పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడుతున్న ఎంఈవోలు, ఎస్ఐ



పాఠశాల ఆవరణలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కాకినాడ టు మైసూరు
ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సామర్లకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ-మైసూరు-కాకినాడ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈనెల 1 సోమవారం నుంచి జనవరి 13 వరకూ నడుపనున్నట్టు రైల్వే ఉన్నతాధికారులు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. సామర్లకోట మీదుగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే ఉన్నతాధికారులు డిసెంబరు 1 నుంచి జనవరి 13 వరకూ ఈ ప్రత్యేక రైళ్ల నడుపనున్నట్టు ఆ ఉత్తర్వుల్లో తెలిపారు. ఈ మేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందిన సమాచారం ఇలా ఉంది.

07033 నంబరు గల కాకినాడ-మైసూరు మధ్య జనవరి 12 వరకూ ప్రతీ సోమ , శుక్ర వారాల్లో కాకినాడలో ఉదయం 9.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 4 గంటలకు మైసూరు చేరుతుంది. ఈ ప్రత్యేక రైలు డిసెంబరు 1, 5, 8, 12, 15, 19, 22, 26, 29 జనవరి 5,9,12 చొప్పున 12 ట్రిప్‌లుగా నడువనుంది. సామర్లకోటకు ఉదయం 9.18 గంటలకు చేరుకుని రాజమహేంద్రవరానికి 10.08 గంటలకు, నిడదవోలుకు 10.38 గంటలకు చేరుతుంది. తణుకు, భీమవరం, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెన పల్లి, పిడుగురాళ్ళ, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, బేగం పేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, సెరం, రాయచూర్, మంత్రాలయ, ఆదోని, గుంత కల్లు, అనంతపూర్, ధర్మవరం, హిందుపూర్, యలహంక, బెంగుళూరు, కెఎస్ఆర్ బెంగుళూ రు, కొనిగెరి, మాండ్యాల మీదుగా మైసూర్‌కు మరుసటి రోజు సాయంత్రం 4 గంటలకు చేరుతుంది.

07034 నంబరు గల రైలు మైసూరు-కాకినాడ మధ్య డిసెంబరు 2 నుంచి జనవరి 13 వరకూ ప్రతీ మంగళ, శనివారాల్లో బయలుదేరనుంది. ఈ ప్రత్యేక రైలు 12 ట్రిప్‌లుగా నడువనుంది. ఈ రైలు డిసెంబరు 2, 6, 9, 13, 16, 20, 23, 27, 30 జనవరి 6,10,13 చొప్పున 12 ట్రిప్‌లుగా నడువనుంది. మైసూ ర్‌లో ఈ రైలు సాయంత్రం 5.20 గంటలకు బయలుదేరుతుంది. మరుసటి రోజు రాత్రి 11 గంటలకు కాకినాడ టౌన్ స్టేషన్‌కు చేరుతుంది. నిడదవోలుకు రాత్రి 8.08 గంటలకు..రాజమహేంద్రవరానికి రాత్రి 8.38 గంటలకు చేరుకుని సామర్లకోటకు రాత్రి 9.18 గంటలకు చేరుకుని కాకినాడ టౌన్ స్టేషన్‌కు రాత్రి 11 గంటలకు చేరుతుంది. కాకినాడ-మైసూరు మధ్య 37 హాల్ట్‌లతో 1,391 కిలోమీటర్ల దూరాన్ని 30 గంటల పాటు ప్రయాణిస్తుంది.

ఈ వారానికి రెండు దఫాలు నడిచే ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించేవారు రిజర్వేషన్ టిక్కట్లు కోసం సమీప రైల్వే స్టేషన్ల లో బుకింగ్ కార్యాలయాలలో సంప్రదించాలని రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి అందిన ఉత్తర్వులలో తెలిపారు. ఈ ప్రత్యేక రైలులో ఎస్ఎల్ఆర్, జీఎస్, హెచ్ఏ-1, ఏ1, బీ1, బీ2, బీ3, బీ4, బీ5, ఎస్1, ఎస్2, ఎస్3, ఎస్4, ఎస్5, ఎస్6, ఎస్7, ఎస్8, ఎస్9, ఎస్10, ఎస్11, జీఎస్, ఎస్ఎల్ఆర్ బోగీలు ఉంటాయి.

‘నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి’

రంపచోడవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించినట్టు గురుకులాల నాన్ టీచింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మాదె రామచంద్రరావు తెలిపారు. గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ వర్తింపు, చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని, తొలగించిన గిరిజన ఉద్యోగులను తిరిగి నియమించాలని కోరారు. కార్యక్రమంలో మనోహర్‌రెడ్డి, అందాల బాలురెడ్డి, బుల్లబ్బాయి తదితరులున్నారు.



ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న రామచంద్రరావు

ఆర్టీసీ సిబ్బంది విధులకు ఆటంకం

ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

కోటనందూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోటనందూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆర్టీసీ బస్సు సిబ్బంది విధుల నిర్వహణకు ఆటంకం కలిగించి బెదిరింపులకు పాల్పడిన ఇద్దరిని సోమవారం అరెస్టు చేశామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. వివరాల ప్రకారం.. సోమవారం కాకినాడ జిల్లా తుని నుంచి నర్సీపట్నం వైపు బయలుదేరిన ఆర్టీసీ బస్సులో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సాలలోది వరలక్ష్మీతో మరువాడ గ్రామానికి చెందిన దిమిటి రాజు టిక్కెట్ చిల్లరపై విషయంపై దుర్భాషలాడి తోసేశాడు. డ్రైవర్ పీఎస్‌బాబు అభ్యంతరం వ్యక్తం చేయగా దిమిటి రాజు కాలర్ పట్టుకుని నెట్టివేశాడు. దీంతో రేఖవానిపాలెం వద్ద దిమిటి రాజు బస్సు దిగిన తరువాత కొంతమంది వ్యక్తులతో కలసి కోటనందూరు సెంటర్ వద్ద బస్సు వద్దకు వచ్చి డ్రైవర్‌పై దాడి చేసి కాలర్ పట్టుకుని బెదిరించారు. నర్సీపట్నం బస్‌స్టాండ్ వద్ద నీ సంగతి తెలుస్తామని బెదిరించారు. డ్రైవర్ తీసిన ఫొటోల ఆధారంగా కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో కండక్టర్ వరలక్ష్మీ ఫిర్యాదు చేయగా సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

తాళ్లరేవు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గాడిమొగ పంచాయతీ చినవలసల గ్రామానికి చెందిన రేకాడి మహాలక్ష్మి కోరింగలోని ఒక రొయ్యల కంపెనీలో పనిచేస్తోంది. గతనెల 29న మధ్యాహ్నం 1గంటకు ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి రాలేదు. ఆమె తండ్రి సుబ్రహ్మణ్యం కోరింగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.సత్యనారాయణ పేర్కొన్నారు.

జన సైనికుని కుటుంబానికి సాయం

మామిడికుదురు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో ఈఏడాది జనవరి నెలలో జన సైనికుడు దొడ్డా సాయినవీన్ మరణించగా బాధిత కుటుంబ సభ్యులకు రూ.5లక్షల చెక్కును పార్టీ తరఫున శాసనమండలి ప్రభుత్వ విప్ పి.హరిప్రసాద్ అందజేశారు. ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కె.శివశ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని 'పీజీఆర్ఎస్'కి వినతులు



అయినవిల్లి మండలం కె.జగన్నాథపురం గ్రామస్తుల నిరసన, అంబాజీపేట మండల సర్పంచ్‌లు


కుమార్తెతో గుత్తుల పుణ్యవతి

అమలాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు.

పంచాయతీలకు స్టాంప్ డ్యూటీ విడుదల చేయాలి: అంబాజీపేట మండల సర్పంచ్‌లు

భూముల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్ల ద్వారా పంచాయతీలకు ఇవ్వాల్సిన స్టాంపు డ్యూటీ వాటాను విడుదల చేయాలని కోరుతూ మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి ఆధ్వర్యంలో అంబాజీపేట మండల సర్పంచ్‌ల బృందం అర్జీ అందించారు. 2023 మే నెల వరకు మాత్రమే స్టాంపు డ్యూటీ విడుదల చేశారని అప్పటినుంచి ఇంతవరకు ఒక్కరూపాయి కూడా విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు, వీధి లైట్ల నిర్వహణ, రక్షిత మంచినీటి సరఫరా వంటి ప్రధాన పనులకు పంచాయతీ సాధారణ నిధులు చాలడం లేదని, నిర్వహణ భారంగా మారినందున స్టాంపు డ్యూటీ సొమ్ములు విడుదల చేయాలని కోరారు. మండలంలోని సర్పంచ్‌లు పితాని మంగాదేవి, తరపట్ల మోహన్‌సింగ్ బాబూరావు, కోట బేబీరాణి, పేరాబత్తుల దొరబాబు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉద్రిక్తతలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి: కె.జగన్నాథపురం రాయివారిపేట గ్రామస్తులు

కె.జగన్నాథపురం శివారు రాయివారిపేటలో రెవెన్యూ భూమి, రోడ్డు మార్జిన్ అంశాలపై గ్రామంలో ఉద్రిక్తలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాయి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు అర్జీ అందించారు. స్థానికంగా ఉన్న చిన్న సమస్యను కుల, వర్గ సమస్యగా మార్చి తప్పుడుప్రచారం చేస్తున్నారని, రెవెన్యూ భూమి విషయంలో విచారణ జరిపి గ్రామంలో ఉద్రిక్తతలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్.బాబ్జి, రాయి శ్రీనివాసరావు, రాయి రత్నకుమారి, రాయి సత్యవతి పాల్గొన్నారు.

దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి: కుమార్తెతో గుత్తుల పుణ్యవతి

పి.గన్నవరం మండలం ముంగండ గ్రామానికి చెందిన గుత్తుల పుణ్యవతి కుమార్తెతో కలసి రాజమహేంద్రవరంలో నివాసం ఉంటున్నారు. వీరికొ కొత్తపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో రిజిస్ట్రేషన్ అయిన కొబ్బరి తోటల్లోకి వెళ్లకుండా కొత్తపాలేనికి చెందిన కొందరు వ్యక్తులు దౌర్జన్యంచేసి దాడులకు పాల్పడుతున్నారని, దీనిపై విచారణ జరిపి రక్షణ కల్పించాలని కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో అర్జీలు అందజేశారు.

ఐదుగురు ఉంటే ఒక్కరి పేరునే ఎఫ్ఎంసీ: మద్దుల ఆదిలక్ష్మీదేవి అక్కాచెల్లెళ్లు, అనాతవరం

అమలాపురానికి చెందిన గొవ్వాల ప్రసాదరావుకు నలుగురు అమ్మాయిలు, ఒక అబ్బాయి సంతానం కాగా రెవెన్యూశాఖ అధికారులు ఒక్కరే బిడ్డ ఉన్నట్టు ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్ ఇవ్వడంతో తాము తీవ్రంగా నష్టపోయామని అక్కాచెల్లెళ్లు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ప్రసాదరావు కుమార్తెలు బొక్కా వరలక్ష్మి, మద్దుల ఆదిలక్ష్మీదేవి, గుబ్బల పద్మ, కొప్పిశెట్టి దుర్గలు జరిగిన అన్యాయాన్ని కలెక్టరేట్‌లో వివరించారు.

కోరంగిలో విమానాశ్రయం ఏర్పాటుకు ఎంపీ వినతి


కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో భేటీ అయిన ఎంపీ హరీష్

అమలాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విమాన సర్వీసుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడును అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి కోరారు. ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో సోమవారం మంత్రిని మర్యాదపూర్వకంగా హరీష్ కలిశారు. ఈసందర్భంగా విజయవాడ, రాజమహేంద్రవరం విమానాశ్రయాల్లో విపరీతంగా పెరిగిన టిక్కెట్ ధరల కారణంగా ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను మంత్రితో చర్చించినట్టు తెలిపారు. ఏపీ నుంచి వారణాశి, సూరత్ వంటి ఆధ్యాత్మిక ప్రదేశాలకు విమాన సర్వీసుల ఆవశ్యకతను వివరించారు. తిరుపతికి కూడా విమాన సర్వీసులు పెంచాలని కోరారు. పుష్కరాలకు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి డిమాండ్ ఉంటుందని, అందుకు అనుగుణంగా సర్వీసులు పెంచేందుకు కృషి చేయాలని ఎంపీ కోరారు. అదేవిధంగా అమలాపురం లోక్‌సభ పరిధిలోని తాళ్లరేవు మండలం కోరంగిలో విమానాశ్రయ నిర్మాణానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని రామ్మోహన్‌నాయుడును ఎంపీ హరీష్ అభ్యర్థించారు.

ఉన్నత పరిశోధనలకు నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి


ఏఐసీ సీఈవో డాక్టర్ దిలీప్‌ను సత్కరిస్తున్న కిమ్స్ ఛైర్మన్ చైతన్యరాజు

అమలాపురం రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉన్నతస్థాయి పరిశోధనలకు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఏఐసీ సీఈవో డాక్టర్ చేకూరి దిలీప్ పేర్కొన్నారు. కోనసీమ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ అమలాపురంలో మిషన్-30 మూడు రోజుల ఫ్యాకల్టీ డెవలెప్మెంట్ ప్రోగ్రాం సోమవారం ముగిసింది. వికసిత్ భారత్-2047లో భాగంగా మూడు రోజుల పాటు కిమ్స్ వైద్య కళాశాలలో పరిశోధన ప్రతిపాదనలకు సిద్ధం అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో విశాఖపట్నం నుంచి ప్రముఖ నిపుణులు పాల్గొన్నారు. వారిలో ఏఐసీ సీఈవో డాక్టర్ దిలీప్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అర్జున్ తిమ్మయ్య, రీసెర్చ్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్ఏకే మొయినుద్దీన్, పబ్లిక్ హెల్త్ రీసెర్చర్ డాక్టర్ ఆర్ఎస్పీ తేజ, సైంటిస్ట్ ఆర్యమన్‌యశస్వి పాల్గొన్నారు. ఫ్యాకల్టీల పరిశోధనల రూపకల్పన, గ్రాంట్ ప్రతిపాదనల తయారీ, బయోమెడికల్ డివైజ్ ఇన్నోవేషన్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా డాక్టర్ దిలీప్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఇన్నోవేషన్‌పై ప్రతీ ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. జాతీయ ప్రాధాన్యం కలిగిన ఆరోగ్య సమస్యలపై ఉన్నతస్థాయి పరిశోధనలు చేయడానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ముగింపు సభలో కిమ్స్ ఛైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) పాల్గొని ముఖ్య వక్తలను సత్కరించారు.

ఎన్టీఆర్ పింఛన్లు పేదలకు భరోసా: ఎమ్మెల్యే బుచ్చిబాబు




ముమ్మిడివరంలో ఎమ్మెల్యే బుచ్చిబాబు, అమలాపురంలో ఎమ్మెల్యే ఆనందరావు,కలెక్టర్ మహేష్‌కుమార్ పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యాలు

జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ

ఐ.పోలవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ పెన్షన్ వృద్ధులకు భరోసాగా ఉందని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. జి.వేమవరం, గుత్తెనదీవి గ్రామాల్లో సోమవారం లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. పెన్షన్ల పంపిణీ పేదప్రజల పట్ల ప్రభుత్వానికున్న బాధ్యత అన్నారు. ప్రతి నెల ఇంటింటికీ వెళ్లి వృద్ధులకు పెన్షన్ అందించడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, టీడీపీ మండల అధ్యక్షుడు సాగిరాజు సూరిబాబురాజు, సర్పంచ్ లంకలపల్లి దుర్గాదేవీమునిరాజు, సొసైటీ అధ్యక్షులు చిక్కాల శ్రీనివాస్, పెంట రవిప్రసాద్, నీటిసంఘం అధ్యక్షులు చోడిశెట్టి నాగబాబు, పడాల లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి పి.రవిరాజు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా పెన్షన్ల పంపిణీ

అమలాపురం రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రతీ నెల క్రమం తప్పకుండా ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు పెంచి పంపిణీ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. సోమవారం గున్నేపల్లి అగ్రహారంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఇతరులకు ఆయన స్వయంగా పెన్షన్లు పంపిణీ చేశారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందని కొనియాడారు. డీసీఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు చొల్లంగి సత్యసాయిబాబా, మంద గెద్దయ్య, ముత్తాబత్తుల వెంకటరమణ, నడింపల్లి ఉదయబాబు, మాడా మాధవి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సామాజిక భద్రత

రాజోలు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పేదల సామాజిక భద్రత కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య అన్నారు. సోమవారం రాజోలులో లబ్ధిదారులకు ఆమె పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవు జ్యోతి, పెద్దాపురం నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు బోళ్ల వెంకటరమణ, పామర్తి రమణ, ఆరుమిల్లి సాయిబాబు, కోఆప్షన్ సభ్యులు షేక్ ఇస్మాయిల్, ఆరుమిల్లి భాను, కడలి వెంకటరమణారావు, మటపర్తి లక్ష్మి, చింతపల్లి నాగలక్ష్మి పాల్గొన్నారు.

పేదలకు భరోసా

మలికిపురం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి):ఎన్టీఆర్ భరోసాతో పేదలకు సామాజిక భద్రత కలుగుతుందని నాటక అకాడమీ డైరెక్టర్ బందెల పద్మ, తెలుగుమహిళ రాష్ట్రప్రధాన కార్యదర్శి మంగెన భూదేవి అన్నారు. మట్టపర్రులో సోమవారం సర్పంచ్ కడలి దుర్గ ఆధ్వర్యంలో వారు ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశారు. టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కనుమూరి సత్తిబాబురాజు, ఉపాధ్యక్షుడు బొలిశెట్టి అప్పారావు, రామేశ్వర ప్రభాకర్, దొరబాబు పాల్గొన్నారు.

పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నియోజకవర్గ కోకన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ నాగాబత్తుల వెంకటసుబ్బారావు అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో బి.మమత పరిశీలించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గుడాల ఫణి, పెదపూడి శ్రీనివాసరావు, రవణంరాము పాల్గొన్నారు. మండలంలో 9141పింఛన్లు ఉండగా రూ.3.83 కోట్లు లబ్ధిదారులకు అందించామన్నారు.

అయినవిల్లిలంకలో అందజేత

అయినవిల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అయినవిల్లిలంకలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంబాజీపేట అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు వస్కా శ్యామ్‌సుందర్, కుమ్మరి వెంకటరమణ, మధుర రమేష్, పాము శ్రీనుబాబు, నక్కా వేణు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా రూ.101కోట్ల పంపిణీ

అమలాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పేదల సామాజిక భద్రతకు ఎన్టీఆర్ భరోసా పేరుతో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పింఛన్లు ఎంతో ప్రయోజనకరమని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని 29వ వార్డు పరిధిలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొని పేదలకు పింఛన్లు అందజేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ పేదల సామాజిక భద్రతే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వివిధ కేటగిరిల పెన్షన్లకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా రూ.101కోట్లను లబ్ధిదారులకు ప్రతీనెల అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ సాయినాథ్ జైచంద్రగాంధీ, మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్, సచివాలయ సిబ్బంది, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు


గున్నేపల్లి పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గున్నేపల్లి అగ్రహారం పంచాయతీ కార్యాలయ నూతన భవనాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సోమవారం ప్రారంభించారు. తొలుత నియోజకవర్గంలో అభివృద్ధికి బాటలు వేస్తున్న ఆనందరావుకు గ్రామస్తులు పూలవర్షం కురిపించి అభిమానాన్ని చాటుకున్నారు. పంచాయతీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, డీసీఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చొల్లంగి సాయిబాబా, సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు, ఉపసర్పంచ్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి శ్రీరామమూర్తి, పేరాబత్తుల నాగభూషణం, కేతా దుర్గారావు, నాగాబత్తుల సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నిర్మాణానికి ఎమ్మెల్యే ఆనందరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పిండి సీతారామయ్య, కేతా వీరాస్వామి, మంద గెద్దయ్య, దేవరపల్లి వీరేష్‌కుమార్, మాడా మాధవి, కొడమంచలి సత్యనారాయణ, కాండ్రేగుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల జిల్లాశాఖ అధ్యక్షుడిగా రామారావు


మాట్లాడుతున్న రామారావు

అమలాపురం టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రీజనల్ స్థాయి సర్వసభ్య సమావేశం అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని నియమించారు. జిల్లాశాఖ అధ్యక్షుడిగా సాకా రామారావు (రావులపాలెం), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విశ్వేశ్వరరావు (మండపేట), జిల్లా కార్యదర్శిగా నల్లిప్రసాద్‌కుమార్ (సఖినేటిపల్లి), ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.మధన్‌మోహన్, (పి.గన్నవరం), కోశాధికారిగా బీహెచ్ శ్రీఆంజనేయులు (అంజిబాబు అమలాపురం), ఉపాధ్యక్షునిగా సీహెచ్ లక్ష్మీనారాయణ (నగరం), నూతన కార్యవర్గాన్ని నియమించారు.సమావేశంలో ముఖ్యులు సీహెచ్ సాయిబాబు, జీజే సుధాకర్, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, అడ్వైజర్ కాశిమోహనరావు, అంబటి రాజారత్నం, అమలాపురం డివిజన్ అధ్యక్షుడు ఐవీ సుబ్రహ్మణ్యం, డివిజన్ కార్యదర్శి నల్లి ప్రసాద్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సామూహిక గీతా పారాయణం

మామిడికుదురు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని పురస్కరించుకుని అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో సామూహిక గీతా పారాయణ సోమవారం ఘనంగా జరిగింది. అమలాపురానికి చెందిన గుత్తుల త్రిమూర్తులు ఆధ్వర్యంలో వంద మంది భక్తులు భక్తిశ్రద్ధలతో గీతా పారాయణం చేశారు. గీతాపారాయణం చేసిన సభ్యులకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

నిత్యాన్నదానానికి విరాళం: బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి యలమంచిలి మండలం పొట్టుపాలేనికి చెందిన కొడవటి సూర్యప్రకాశరావు-రామలక్ష్మి దంపతులు రూ.10,120 విరాళంగా అందించారు. దాత దంపతులకు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేశారు.

ఘనంగా సంస్కృతి ఉత్సవ్ బహుమతి ప్రదానోత్సవం

అమలాపురం టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అమలాపురం యర్రమిల్లివారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీ సకలకార్యసిద్ధి మరకత హనుమాన్ మందిర్ వద్ద హనుమద్వ్రత పూజా మహోత్సవాల్లో భాగంగా సంస్కృతి ఉత్సవ్-2025 నిర్వహించారు. ఈపోటీల్లో రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన 290మంది విద్యార్థులకు ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణురాలు డాక్టర్ ఆశ్లేష బహుమతులను అందజేశారు. ఈపోటీల్లో 3,200మంది విద్యార్థులు పాల్గొన్నట్టు ఆకొండి సింహాచలం సర్వీసు ట్రస్టు ఛైర్మన్ ఆకొండి పవన్‌కుమార్ తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఆకొండి మహేష్‌శర్మ, వేదనభట్ల సాయిలక్ష్మి, దేవపూజ్యుల నాగమణి, ఆకొండి అంజి, ఆకొండి రవీంద్ర పాల్గొన్నారు.

అధ్వానంగా ఈర్ల చెరువు రోడ్డు



మామిడికుదురు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు నుంచి ఈర్లచెరువు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి అధ్వానంగా తయారవ్వడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు కిలోమీటర్ల మేర రోడ్డు యావత్తు గుంతలు పడి ప్రమాదకరంగా తయారైంది. నిత్యం ఈరోడ్డు మీదుగా వేలాది మంది ప్రయాణాలు చేసి మండల కేంద్రం మామిడికుదురు, ఇతర ప్రాంతాలకు వస్తుంటారు. రోడ్డు యావత్తు గోతులమయం కావడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వర్షాలొస్తే ఈగోతుల్లో వర్షం నీరు చేరి ఇబ్బందులు రెట్టింపు అవుతున్నాయని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని ఈర్ల చెరువు, చేరీ తోట ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో మట్టి ట్రాక్టర్లు తిరగడం వల్ల రోడ్డుపై మట్టిచేరి వర్షాకాలంలో పడుతున్న తీవ్ర ఇబ్బందులు నుంచి గట్టెక్కించాలని ప్రజలు కోరుతున్నారు.

వృత్తికళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

మామిడికుదురు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వృత్తి కళాకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని కోనసీమ వృత్తి కళాకారుల సంక్షేమ సంఘ సమావేశం కోరింది. సంఘ సమావేశం మామిడికుదురులోని అంబేడ్కర్ సామాజిక భవనంలో సోమవారం సంఘ అధ్యక్షుడు మంగం సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పింఛన్లను పెంచాలని, బ్యాంకు అక్కౌంట్లలో జమ చేయాలని కోరారు. పింఛను వయో పరిమితిని 60నుంచి 50ఏళ్లకు తగ్గించాలని, కళాకారులకు ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వమే పూర్తి చేయాలని, హెల్త్‌కార్డులు సమకూర్చాలని, రైలు, బస్సు ప్రయాణాల్లో 50శాతం రాయితీ కల్పించాలని కోరారు. అనంతరం సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు మంగం సత్యనారాయణ డాక్టరేట్, పలు పురస్కారాలు అందుకోవడంతో ఆయన్ను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, అడబాల సత్యనారాయణమూర్తి, నాగరాజు, సారే రాణి, కోటిపల్లి శ్రీదేవి, చిట్టూరి దాశరథి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు

అమలాపురం టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని పురస్కరించుకుని సంస్కారభారతి కోనసీమ జిల్లా శాఖ, శ్రీశారదా గ్రంథమాలిక ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. అమలాపురం భూపయ్య అగ్రహారంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో భక్తుల ఆధ్వర్యంలో గీతా పారాయణం నిర్వహించారు. సంస్కార భారతి జిల్లా శాఖ అధ్యక్షురాలు శ్రీగిరి పద్మావతి ఆధ్వర్యంలో ఈకార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా అమలాపురం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి వైశ్యసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గీతా దినోత్సవ వేడుకల్లో పట్టణ సీఐ పి.వీరబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవ ర్యాలీ

ముమ్మిడివరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం సామాజిక ఆరోగ్య కేంద్రంలోని ఎయిడ్స్ నియంత్రణ యూనిట్ ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్, ఎంజీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల రెడ్‌రిబ్బన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఎయిడ్స్ నివారణ దినోత్సవ అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈర్యాలీ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి మెయిన్ రోడ్డు మీదుగా పోలీసుస్టేషన్ వరకు సాగింది. అక్కడ మానవహారం నిర్వహించి వైద్య సిబ్బంది, విద్యార్థులతో ఎయిడ్స్ వ్యాధిపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వై.లోకేశ్, డాక్టర్ ఎన్.నితీష్‌కుమార్, డాక్టర్ నిఖిత, డాక్టర్ జి.కుమార్, ఎంజీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రశాంతి, కోఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు, ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపిద్దామని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ రహిత దినోత్సవం సందర్భంగా అంబాజీపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యాధికారులు డాక్టర్ కేఎస్ శ్రీనివాస్, వి.గౌతమిలు సోమవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ నుంచి సెంటర్ వరకూ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): బోడసకుర్రు గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి సోమవారం ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, ఉపసర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, రాపాక సౌమ్య, సత్యనారాయణ, అరవ చంటి, ముత్యాల బాబి, రొక్కాల నాగేశ్వరరావు, మొయిల గణపతిరావు, అయిల నాగేశ్వరరావు, దొమ్మేటి రాధాకృష్ణ, వీఆర్వో యు.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా విశ్వేశ్వరాయపురంలో వివేకానంద ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలవిద్యార్థులు జిల్లా జ్ఞానవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం ఎయిడ్స్ నిర్మూలన ర్యాలీ నిర్వహించారు. 9వ తరగతి చదువుతున్న కె.అఖి ఎయిడ్స్ భూత వేషధారణలో, విద్యార్థులు ప్లకార్డులతో అవగాహన కల్పిస్తూ గుడిమెళ్లలంక వంతెన వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పీవీవీ వరప్రసాద్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌పై అందరికీ అవగాహన ఉండాలని టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య అన్నారు. రాజోలు హెల్త్ కమ్యూనిటీ సెంటర్ ఐసీటీసీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకుడు బోళ్ల వెంకటరమణ, ఉప సర్పంచ్ పామర్తి రమణ, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, అడబాల విజయ్, మటపర్తి లక్ష్మీ, రావి మురళీ, కట్టా సూరిబాబు, కడలి వెంకటరరమణారావు, నార్కేడుమిల్లి విష్ణు, కొండబాబు, పట్నాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు

యానాం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): యానాం విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం నుంచి ప్రాంతీయస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. విద్యార్థుల్లో సాంకేతిక, సృజనాత్మక వైజ్ఞానిక స్ఫూర్తి పెంపొందించడానికి ఈనెల2 నుంచి 4వరకు ఈప్రదర్శన నిర్వహిస్తున్నారు. యానాంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు నాలుగు విభాగాల్లో పోటీలు జరుగుతాయి. దీనిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు పుదుచ్చేరిలో ఈనెల 7,8 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న అమూల్య

రాజోలు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.92,510 చెక్కును కాట్రేనిపాడుకు చెందిన బి.దుర్గాప్రసాద్ స్వగృహానికి సోమవారం ఆమె వెళ్లి అందజేశారు. ఈసందర్భంగా టీడీపీ ఇన్‌చార్జి అమూల్య విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబురాజు, గోదావరి డెల్టా ప్రాజెక్టు మాజీ ఛైర్మన్ భూపతిరాజు ఈశ్వరరాజువర్మ, సర్పంచ్ అడబాల శ్రీనివాసరావు, అడబాల చంటి, అనుచూరి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

మలికిపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తూర్పుపాలేనికి చెందిన బత్తుల రాజారత్నానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య రూ.44,127 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును సోమవారం అందజేశారు. వారి యోగ క్షేమాలు అడిగితెలుసుకుని, ఏకష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తూర్పుపాలెంలో అమూల్య ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశారు.

ఉద్యోగులకు నియామక ఉత్తర్వుల అందజేత

యానాం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల జరిగిన పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు పుదుచ్చేరి గవర్నర్ కైలాస్‌నాథన్, ముఖ్యమంత్రి ఎన్.రంగసామి నేతృత్వంలో నియామక ఉత్తర్వులు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా అసిస్టెంట్-234, వీఏవో-29, వీఏఏ-37, ఎంటీఎస్-8(తూనికలు కొలతలశాఖ)ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు అందజేశారు. యానాంలో పలు శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో వీరికి పోస్టింగ్ ఇచ్చారు.

స్వామి దయానంద సరస్వతి పేరిట స్మారక నాణేలు



అమలాపురం టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): 1857 ప్రథమ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన ఎందరో స్వాతంత్ర్య సమరయోధులకు ప్రేరణగా నిలిచిన స్వామి దయానంద సరస్వతి పేరిట కోలకతా టంకశాల స్మారక నాణేలను విడుదల చేసింది. స్వామి దయానంద సరస్వతి జయంతిని పురస్కరించుకుని 200ఏళ్ల పూర్తయినందున రూ.200 ఆయన పేరిట ఆర్యసమాజ స్థాపన జరిగి 150ఏళ్లు పూర్తయిన సందర్భంగా రూ.150 నాణేలను విడుదల చేశారు. ఈనాణేలను అమలాపురానికి చెందిన ప్రముఖ నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణకామేశ్వర్ సేకరించారు. ఒక్కో నాణెం 32 గ్రాములు బరువు కలిగి 60శాతం రాగి, 20 శాతం నికెల్, మరో 20శాతం జింక్‌తో తయారు చేశారని కృష్ణకామేశ్వర్ తెలిపారు.

డిప్యూటీ ఎంపీడీవోలు బాధ్యతల స్వీకరణ

అంబాజీపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మండలం డిప్యూటీ ఎంపీడీవోగా మహ్మద్ అబ్బాస్ ఆలీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మల్కిపురం మండలం లక్కవరం గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఎంపీడీవో బి.మమత, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావులను ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

అల్లవరం,(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీవోగా వై.లక్ష్మీనరసమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఆమెకు ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి, జడ్పీటీసీ కొనుకు గౌతమిలు శుభాకాంక్షలు తెలిపారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీవోగా ఆర్.సూర్యనారాయణమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అయినవిల్లి మండలం అయినవిల్లిలంక గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఎంపీడీవో ఎం.మల్లికార్జునరావును మర్యాదపూర్వకంగా కలిశారు. పలు సచివాలయాలను సందర్శించగా సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ

అంతర్వేది, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రామేశ్వరంలో విలేజ్ వెల్ఫేర్ అసోసియేషన్ ట్రస్టు 13వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. సఖినేటిపల్లి ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్ చేతులమీదుగా వంద మంది పేదలకు 5కిలోల బియ్యం, 8రకాల నిత్యావసరాలు, రూ.100నగదును చొప్పున అందించారు. సర్పంచ్ కట్టా ఉమామహేశ్వరరావు, మధురాజు, బళ్ల విజయసారథి, వీరా త్రినాథ్, సరెళ్లవిజయ్‌ప్రసాద్, ఈదర రవిరెడ్డి, మంగెన శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడుచెల్లింగి శ్రీనివాస్, పాటబళ్ల సూరిబాబు పాల్గొన్నారు.

ప్రజల ప్రశంసలే అసలైన పదోన్నతి

ఉప్పలగుప్తం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉద్యోగికి ప్రజల నుంచి లభించే ప్రశంసలే నిజమైన ఉద్యోగోన్నతి అవుతుందని ఎంపీడీవో జి.కృష్ణ అన్నారు. భీమనపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి పదోన్నతిపై వరరామచంద్రపురం డిప్యూటీ ఎంపీడీవోగా బదిలీ అయిన పెట్టా నాగేశ్వరరావును సోమవారం కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో సన్మానించారు. ఎంపీడీవో కార్యాలయ పర్యవేక్షకుడు బీహెచ్ తులసీకృష్ణ, ఉపాధి ఏపీవో ఎం.వీరబాబు, కార్యదర్శులు పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

ముమ్మిడివరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ప్రాంగణంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంపై న్యాయ విజ్ఞాన సదస్సు సోమవారం జరిగింది. సదస్సులో జడ్జి మాట్లాడుతూ ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, వారిని ఎగతాళి చేయరాదన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, ప్యానల్ అడ్వకేట్ కేఆర్కే రాజు, టి.శాంతి సుధ, ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



జాతీయస్థాయి టెన్నికాయిట్ క్రీడాకారులు

జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మండపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి టెన్నికాయిట్ క్రీడా పోటీల్లో మండపేటకు చెందిన క్రీడాకారులు సత్తాచాటారు. గతనెల 26వ తేదీ నుంచి 30 వరకు నాలుగు రోజులపాటు జమ్ముకాశ్మీర్‌లో జరిగిన 42వ జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో మండపేటకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. 28 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో పట్టణానికి చెందిన బళ్ల సత్యనారాయణ, కొల్లి శివ శంకర్ ప్రసాద్ బాలుర డబుల్ విభాగంలో మూడోస్థానంలో నిలిచారు. కోచ్ కుంచే రమేష్ నేతృత్వంలో వీరు విజయాన్ని పొందారు. విజేతలైన క్రీడాకారులను కాకినాడ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు అప్పాని కృష్ణకుమారి అభినందించారు. అక్కడ జరిగిన పోటీల్లో విజేతలైన వారికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నుంచి పతకాలు అందుకున్నారు. క్రీడాకారులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఏపీఐడీసీ చైర్మన్ లీలాకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి తదితరులు అభినందించారు.

పసలపూడి ఆలయంలో మంత్రి సుభాష్ పూజలు

రాయవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పసలపూడి మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామిని సోమవారం మంత్రి వాసంశెట్టి శుభాష్ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పరిటాల శ్రీనివాస్, కేదార్ ఆధ్వర్యంలో స్వామివారికి అర్చనలు, హారతులు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న మంత్రికి అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భీమేశ్వరస్వామి ఆలయ విశిష్టతను అర్చకులు ఆయనకు వివరించారు. కార్యక్రమంలో సినీ దర్శకుడు కర్రి రామారెడ్డి, ఎం.బ్రహ్మారెడ్డి, ఎం.వికాస్ రెడ్డి, నల్లమిల్లి భాస్కర్‌రెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, సత్తి వీరాఘవరెడ్డి తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

కొత్తపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హైస్కూల్ నుంచే విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లాకోన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర, హెచ్ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

మూసుకుపోయిన పంట కాలువకు తవ్వకాలు

• ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన అధికారులు • రైతుల హర్షాతిరేకాలు

ఆలమూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రబీపంటలో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే ఆలమూరు-వెదురుమూడి పంట కాలువ మూసుకుపోవడంతో సోమవారం ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు ప్రారంభించారు. నవంబరు 30న ఆంధ్రజ్యోతిలో 'కాలువ మూసుకుపోయినా పట్టదా?' అనే శీర్షికతో ప్రచురితమైన ఆంధ్రజ్యోతి కథనానికి రాష్ట్ర నీటిపారుదల మంత్రి నిమ్మల రామానాయుడు స్పందించి తక్షణం మూసుకుపోయిన కాలువను వెంటనే తవ్వకాలు చేపట్టాలని సూచనలు అందించడంతో కాలువ తవ్వకాలు ప్రారంభించారు. చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఆలమూరు ఏఈ కృష్ణత్రిమూర్తుల ఆధ్వర్యంలో సోమవారం ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు మొదలుపెట్టారు. ఈ పంటకాలువ ద్వారా ఆలమూరు, చింతలూరు, పినపళ్ల, సంధిపూడి, అంగర గ్రామాల ఆయకట్టుకు సంబంధించిన వేలాది ఎకరాలకు సాగునీరు చేరనున్నది. ఈ పంట కాలువకు తవ్వకాలు చేపట్టకపోవడంతో పూర్తిగా మూసుకు పోయింది. కాలువలో పూడికలను తీసే పనితో పాటు తవ్వకాలు చేస్తున్నట్టు నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు తెలిపారు.



ఆలమూరు మండలం సంధిపూడి వద్ద పంట కాలువను తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

పేదల శ్రేయస్సే కూటమి ప్రభుత్వం లక్ష్యం

• ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో మంత్రి సుభాష్, ఎమ్మెల్యేలు వేగుళ్ల, బండారు

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలకు ఆసరాగా నిలుస్తున్నాయని మంత్రి సుభాష్ అన్నారు. సోమవారం రామచంద్రపురంలో 5, 6 వార్డుల్లో పింఛన్లు పంపిణీలో ఆయన పాల్గొన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, డీఈ శ్రీకాంత్, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉండవిల్లి శివ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పింఛన్లను అందజేసిన ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట(ఆంధ్రజ్యోతి): మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను ఆయా లబ్ధిదారులకు మున్సిపల్ అధికారులు, వార్డు ఇన్‌చార్జిలతో కలిసి పంపిణీ చేశారు. వర్షం పడుతున్నా ఆయన అధికారులతో కలిసి పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఆయన వెంట కమిషనర్ రంగారావు, వార్డు ఇన్‌చార్జిలు, కూటమి నేతలు వున్నారు.

పింఛన్లు అందజేసిన ఎమ్మెల్యే బండారు

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చొప్పెల్లలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సోమవారం లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. గ్రామంలో ఇంటికి వెళ్లి పలువురు పింఛన్‌దారులకు నేరుగా వాటిని అందించి పంపిణీ తీరుపై ఆయన వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.రాజు, నాయకులు మెర్ల గోపాలస్వామి, ఆకుల రామకృష్ణ, సూరపురెడ్డి సత్య, ఈదల సత్తిబాబు, నైనాల శ్రీరామచంద్రమూర్తి, బళ్ల హరి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఎన్‌టీఆర్ పింఛన్లు అండ

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబాలకు ఎన్‌టీఆర్ పింఛన్లు అండగా నిలుస్తున్నాయని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సలాది రమేష్ అన్నారు. సోమవారం ఆయన సత్యవాడ గ్రామంలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఆయన వివరించారు. శివలలో యర్రపోతవరం డీసీ అధ్యక్షుడు ఎస్.సుబ్రహ్మణ్యం పేదలకు పింఛన్లు పంపిణీ చేశారు. కుందూరులో సొసైటీ అధ్యక్షుడు జగతా రమణ, కూటమి నాయకుడు మేడిశెట్టి బాబి పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో కూటమి నాయకులు ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు.





ఆలమూరు మండలం చొప్పెల్లలో పింఛన్ పంపిణీ చేస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు. పక్క చిత్రంలో మండపేటలో పింఛన్ పంపిణీ చేస్తున్న మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల

'విలీనాన్ని అడ్డుకుంటే ఊరుకోం'

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జయరాజు

మండపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గాన్ని తూర్పులో కలిపే విషయంలో ఎవరైనా అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి డి.జయరాజు హెచ్చరించారు. మండపేటలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు విలీన ప్రక్రియను అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ప్రజా ప్రతినిధులు ప్రజల ఆకాంక్షను నెరవేరిస్తే, ఇక్కడ మాత్రం ఇన్‌చార్జిగా వున్న తోట త్రిమూర్తులు గత ప్రభుత్వంలో ప్రజల ఆకాంక్షను చెప్పలేదని ధ్వజమెత్తారు. ఇక్కడ ప్రతిపక్ష పాత్రలో ప్రజలను తప్పుదోవ పట్టించాలనుకుంటే అది భ్రమగా మిగులుతుందన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎం.సూరిబాబు, గాలింకి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్, టీచర్స్ సభను విజయవంతం చేయాలి

కె.గంగవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈనెల 5న జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని విజయవంతం చేసేందుకు ముందస్తు సన్నాహక సమావేశాలు నిర్వహించాలని ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు కోరారు. సభను విజయవంతం చేసేందుకుకు ప్రతి పాఠశాలకు మండలస్థాయి అధికారిని నియమించామని వారు 5లోపుగా సన్నాహక సమావేశాలు నిర్వహించాలని కోరారు.





ప్రత్యేక అలంకరణలో రాయవరం మండలం వెదురుపాక గీతా మందిరంలోని శ్రీకృష్ణుడు. పక్క చిత్రంలో వాడపల్లి వెంకన్న ఆలయంలో గీతా పారాయణ చేస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో గీతా జయంతి వేడుకలు

ఆత్రేయపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గీతా జయంతి సందర్భంగా సోమవారం పారాయణం నిర్వహించారు. శ్రీకృష్ణ పరివార్ సంఘం కాకినాడ ఆధ్వర్యంలో 130వ పారాయణను వైభవంగా నిర్వహించారు. రావులపాలేనికి చెందిన మహిళా మండలి ఆధ్వర్యంలో సంపూర్ణ గీతా పారాయణం నిర్వహించారు. స్వామివారి వసంత మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి శ్రద్ధలతో గీతా పారాయణ నిర్వహించారు. అశేష భక్తజనం పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆకట్టుకున్న నగర సంకీర్తన

రాయవరం (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక గీతా మందిరంలో గీతా జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. గీతా మందిరం నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెల్లవారుజామున 5 గంటల నుంచే భగవద్గీత 18 అధ్యాయాల పారాయణ, నగర సంకీర్తన నిర్వహించారు. పురోహితుడు అంగర జనార్దనాచార్యులు అర్చకత్వంలో కొంకుదురు గ్రామానికి చెందిన నల్లమిల్లి శివరామ కృష్ణారెడ్డి, లక్ష్మీబిందు దంపతుల చేతులమీదుగా గీతాయజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీగాయత్రి ఆస్థాన పీఠాధిపతి ఇటికిరాల సుబ్రహ్మణ్యశర్మ భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు.

ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శన: గీతా జయంతిని పురస్కరించుకుని వైజయంతి కూచిపూడి నృత్య బృందం గురువు పద్మ వైజయంతి ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయా భక్తి పాటలకు చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం నృత్య ప్రదర్శన, భగవద్గీత పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొలుగూరి వరలక్ష్మి, నాగులపల్లి వీరవెంకట సత్యనారాయణ, పడాల శివ మణికంఠరెడ్డి, సత్సంగ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): గీతా జయంతి సందర్భంగా సోమవారం చింతలూరులోనున్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో భగవద్గీత పూజలను నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు పెదపూడి సత్యనారాయణాచార్యులు భగవద్గీతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు స్వామివారి చెంత భగవద్గీత శ్లోకాలను ఆలపించి గీతా పారాయణ నిర్వహించారు. సంధిపూడి వేణుగోపాల స్వామి ఆలయంలో అర్చకులు అంగర గోపాల కృష్ణ అధ్వర్యంలో గీతా జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

మండపేట(ఆంధ్రజ్యోతి): మండపేట రథం గుడి సెంటర్‌లోనున్న నవజనార్దనస్వామి ఆలయంలో గీతా జయంతి వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకస్వాములు ఖండపల్లి గోపాలకృష్ణమాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ప్రతిరోజూ గీతా పారాయణతోపాటు భజనలు, హోమాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు చెప్పారు. నాలుగు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. నాలుగు రోజులపాటు నిర్వహించే గీతా జయంతి వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకోవాలని నిర్వాహకులు కోరారు.



మండపేటలోని జనార్దనస్వామి ఆలయంలో స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకస్వామి

అవగాహనతోనే ఎయిడ్స్ నిర్మూలన సాధ్యం

• మంత్రి సుభాష్



రామచంద్రపురంలో ఎయిడ్స్ నివారణ ర్యాలీలో పాల్గొన్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అవగాహనతోనే దాని నిర్మూలన సాధ్యమని మంత్రి సుభాష్ అన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏరియా ఆసుపత్రి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సుభాష్ పాల్గొని ప్రతిజ్ఞ చేయించారు. ఏరియా ఆసుపత్రి పర్యవేక్షక వైద్యుడు డాక్టర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. రాజగోపాల్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎయిడ్స్ మరణాలు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రి ద్వారా 3,449 మందికి ఏఆర్‌టీ డ్రగ్స్ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ చక్రధర్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆర్.జయప్రద, ఆర్ఎంవో డాక్టర్ చక్రధర్, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు గొల్లపల్లి కృష్ణ, కంచుమర్తి బాబూరావు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, పలు నర్సింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి, ఐసీటీసీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్ సెంటర్‌లో వ్యాధి నిర్మూలన ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.దుర్గాప్రసాద్, ఐసీటీసీ కౌన్సిలర్ జి.గీతాంజలి, ఏ.వెంకటరత్నం, కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి

మండపేట(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ నివారణ డేలో భాగంగా మండపేట ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకట్రామయ్య ర్యాలీని ప్రారంభించారు. ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మండపేట మండలం ద్వారపూడి, కేశవరం వైద్య కేంద్రాల వద్ద ఎయిడ్స్ నివారణ ర్యాలీలను నిర్వహించారు. ఎయిడ్స్ లక్షణాలపై వైద్యులు వివరించారు. ఎయిడ్స్ నివారణ ర్యాలీ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాగలక్ష్మి, వైద్యులు భావన, శిరీష, ప్రశాంతి, సంధ్య, స్టాఫ్‌నర్సు మాధురి, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు కోనా సత్యనారాయణ, మండపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొల్లంరెడ్డి సత్యనారాయణ, కార్యదర్శి నాగేంద్ర, కాళ్ల బాబు, కె.వీర్రాజు, కురసాల సత్యనారాయణ, చెన్నా రాంబాబు, గాలింకి నాగేశ్వరరావు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌ను తరిమికొడదాం

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ మహమ్మారిని తరిమి కొడదామని వైద్యాధికారులు హైమశ్రీ పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం ఆత్రేయపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఎయిడ్స్‌ను నిర్మూలించాలంటూ ప్రచార ర్యాలీ నిర్వహించి ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ర్యాలి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణ ర్యాలీని నిర్వహించగా వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యు.రమేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ అధికారి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నిర్మూలన పై ర్యాలీ నిర్వహించారు. కళాశాల విద్యార్థులు జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి మానవ హారం చేపట్టి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుభాషిణి, బీవీఎస్ రెడ్డి, రజని, ప్రసాద్, రాజేంద్ర, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): అంగర పీహెచ్‌సీ వద్ద సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి రత్నకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బందికి హెచ్ఐవీ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడారు. కపిలేశ్వరపురం సీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవంపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో అంగర పీహెచ్‌సీ, కపిలేశ్వరపురం సీహెచ్‌సీ వైద్యాధికారులు బి.అనంతరామకృష్ణ, కె. శ్రావణి, బి. సత్య భవానీలతో పాటు, ఎంపీహెచ్ఈవో మల్లిఖార్జునుడు, హెచ్‌వీ మేరీమణి, హెల్త్ సూపర్‌వైజర్ నానిబాబు, ప్రజాప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తిరునక్షత్ర పూజలు

ఆత్రేయపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరునక్షత్ర ఉత్సవాలను రెండవ రోజు ఘనంగా నిర్వహించారు. తిరుమంగయై ఆళ్వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవాకాలం, ద్రవిడ వేదపారాయణ నిర్వహించారు. సాయంత్రం పల్లకీ ఉత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. నిత్యాన్నదాన పథకానికి ఏలూరుకు చెందిన లంకలపల్లి వెంకటేశ్వరరావు-భూలక్ష్మి దంపతులు రూ.25,116 విరాళం ఇవ్వగా వారికి స్వామివారి చిత్రపటం అందజేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు.



వాడపల్లి ఆలయంలో తిరునక్షత్ర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

'పరంజ్యోతి ఆశయాల సాధనకు ఉద్యమించాలి'



పరంజ్యోతి స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ద్రాక్షారామ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దివంగత గుర్రాల పరంజ్యోతి ఆశయాల సాధనకు ఉద్యమించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు చీకట్ల వెంకటేశ్వరరావు కోరారు. వెంకటాయపాలెం శివారు వీరేశగుళ్ల కాలనీలో పరంజ్యోతి స్మారక గ్రంథాలయంలో 20వ వర్ధంతి జరిగింది. తొలుత పరంజ్యోతి స్మారక స్థూపం వద్ద సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, ఆర్‌టీసీ యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు గాంధీ రాజు, పరంజ్యోతి కుటుంబీకులు గుర్రాల దయామణి, రాహుల్, రేణుక, సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, యల్లమిల్లి సతీష్‌కుమారి, ఏపీఐడీసీ మాజీ డైరెక్టరు శ్యామ్ తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు నాయకులు చింతా రాజారెడ్డి, అంబటి కృష్ణ, జై భీమ్ సంక్షేమ సంఘం నాయకులు గుబ్బల శ్రీనివాస్, వి.రామకృష్ణ, సి. పట్టాభి రామయ్య, కోటి చినరాజు, పీడీఎస్‌యు నవీన్, అరుణోదయ సంస్థ నాయకులు శ్రీను, ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

ఆలమూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండల సచివాలయ ఉద్యోగుల డిప్యూటీ ఎంపీడీవోగా నియమితులైన ఎస్.వీర్రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శిగా పనిచేస్తున్న ఎస్.వీర్రాజుకు పంచాయతీరాజ్‌లో ఇటీవల వచ్చిన పదోన్నతుల్లో భాగంగా డిప్యూటీ ఎంపీడీవోగా నియమించారు. ఈయనకు ఆలమూరు మండలం కేటాయించడంతో సోమవారం ఎంపీడీవో ఎ.రాజుకు నియామకపు పత్రాన్ని అందించి బాధ్యతలు స్వీకరించారు.



ఆలమూరు డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న వీర్రాజు

కేశవస్వామి, సోమేశ్వరస్వామి ఆలయాల పాలకమండళ్ల ప్రమాణ స్వీకారం



వెంటూరులో కేశవస్వామి, సోమేశ్వర స్వామి చైర్మన్‌లను సత్కరిస్తున్న దృశ్యం

రాయవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంటూరు కేశవ పట్టాభిరామ స్వామి, సోమేశ్వరస్వామి ఆలయ పాలక మండళ్ల సభ్యులు ప్రమాణ స్వీకారం సోమవారం నిర్వహించారు. ఈవో శోభారాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రిమ్మలపూడి వేణుగోపాలదొర పాల్గొని మాట్లాడుతూ నూతన పాలక మండళ్లు ఆలయాల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. సోమేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా గుత్తుల శ్రీనివాస్, కేశవ పట్టాభి రామస్వామి దేవస్థానం చైర్మన్‌గా వల్లూరి వెంకటరావు (శ్రీను) ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిపి 10 మంది సభ్యులు వంతున రెండు ఆలయాలకు చెందిన 20 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్, వెంకటరావులను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కొప్పిశెట్టి మాధవరావు, చెల్లూరు సహకార సంఘం త్రిసభ్య కమిటీ చైర్మన్ దేవళ్ల వెంకట్రావు, ఉప సర్పంచ్ నున్న ప్రదీప్ కుమార్, జనసేన నాయకుడు గొడితి సత్యం, చిరట్ల అప్పారావు, వాసంశెట్టి శివప్రసాద్, మేడిశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రగ్బీలో సత్తా చాటిన మహాలక్ష్మి

ద్రాక్షారామ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా పొదలకూరులో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్ 17 రగ్బీ బాలికల పోటీల్లో తూర్పుగోదావరి జట్టు విజేతగా నిలిచి బంగారు పతకం సాధించింది. జట్టులో ద్రాక్షారామ జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని టేకుమూడి మహాలక్ష్మి ప్రతిభ కనబర్చి జట్టు విజయానికి దోహదపడిందని హెచ్ఎం పేరిచర్ల శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొన్న ప్రేమ సాయి, రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పాల్గొన్న సంతోష్, అండర్ 14 క్రికెట్ జట్టుకు స్టాండ్‌బైగా ఎంపికైన వైష్ణవి, అండ్ 14 రగ్బీ స్టాండ్‌బై నవ్య రత్నలను అభినందించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఆని శ్రీనివాస్, ఉమాలను అభినందించారు.



మహాలక్ష్మిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు



రథం షెడ్డును ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

అగస్త్యేశ్వరస్వామి రథం షెడ్డును ప్రారంభించిన మంత్రి

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో దాత శ్రీఘాకొళ్లపు సూర్యనారాయణ నిర్మించిన రథంషెడ్డును మంత్రి సుభాష్ సోమవారం ప్రారంభించారు. ముందుగా అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మంత్రి పూజలు జరిపిన అనంతరం రథం షెడ్డును ప్రారంభించారు. ఆరుబయట రథం ఉండటంతో మంత్రి సుభాష్ సూచన మేరకు దాత షెడ్డును నిర్మించగా మంత్రి సుభాష్ ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో అగస్త్యేశ్వరస్వామి ధర్మకర్తల మండలి చైర్మన్ చెరుకుపల్లి గణేష్ శర్మ, ఈవో సీహెచ్‌వీ సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉండవిల్లి శివ, కంచుమర్తి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.